

యూట్యూబ్ కుర్రోళ్లు

- ఇప్పటి వరకు 399 వీడియోలు అప్‌లోడ్, 5.28 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు



- హేళన చేసిన వారి నుంచే ప్రశంసలు పొందిన అనంతగిరి యువకులు

8వ పేజీలో

మళ్లీ బెల్టు షాపులు

మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో అక్రమ అమ్మకాలకు రంగం సిద్ధం

- స్థానిక పెద్దలతో మద్యం వ్యాపారులు మంతనాలు
- సాఫీగా వ్యాపారం సాగడానికి సహకరించాలని వినతి



బెల్టు దుకాణంలో గ్లాసులో మద్యం పోసుకుంటున్న మందుబాబు (ఫైల్ ఫొటో)

చోడవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): **గ్రామాల్లో బెల్టు షాపులకు మద్యం వ్యాపారులు తెర తీస్తున్నారు. లైసెన్సుడ్ దుకాణాలు లేనిచోట్ల కిల్లీ బంకులు, కిరాణా షాపులు, టిఫిన్ సెంటర్లలో చాటుమాటుగా మద్యం అమ్మకాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వుండడానికి స్థానిక పెద్దలను కలుస్తున్నారు. తమ దుకాణాల నుంచి బెల్టు షాపులకు మద్యం సరఫరా, అమ్మకాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని కోరుతున్నట్టు తెలిసింది.**

రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం సొంతంగా మద్యం వ్యాపారం చేయగా.. కూటమి ప్రభుత్వం గతంలో మాదిరిగా ప్రైవేటు దుకాణాలకు అనుమతి ఇచ్చింది. వైసీపీ హయాంలో నాసిరకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయించగా, తాము అధికారంలోకి వస్తే ప్రముఖ కంపెనీల మద్యాన్ని అందు బాటులోకి తీసుకువచ్చి, తక్కువ ధరకు విక్రయించేలా చర్యలు చేపడతామని గత ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఆ ప్రకారం నూతన మద్యం పాలసీని ఇటీవల ప్రకటించి, ఈ నెల 16వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో మందుబాబులు సంతోషించారు. అయితే లాటరీలో మద్యం షాపులను దక్కించుకున్న వ్యాపారులు అక్రమ మార్గాలకు తెరతీస్తున్నారు. తమ దుకాణాలు లేని గ్రామాలతోపాటు దుకాణాలకు దూరంగా వున్న ప్రాంతాల్లో 'బెల్టు' విక్రయాలకు ఏర్పాట్లు మొదలుపెట్టారు. వైసీపీ పాలనలో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాల్లో మద్యం అమ్మకాలు విపరీతంగా సాగాయి. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ రేటుకు విక్రయించారు. దీంతో అప్పటి ప్రభుత్వ తీరుపై మందుబాబులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా బెల్టు దుకాణాల సంస్కృతి కొనసాగడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. లాటరీ ద్వారా మద్యం దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు.. గ్రామాల్లో బెల్టు అమ్మకాల కోసం స్థానిక పెద్దలతో మంతనాలు సాగిస్తున్నారు. తమ 'బెల్టు' వ్యాపారం సాఫీగా సాగడానికి సహకరించాలని కోరుతున్నట్టు తెలిసింది. కాగా బెల్టు దుకాణాల్లో మద్యం కల్తీ జరిగే అవకాశం వుందని, తక్కువ ఖరీదుగల మద్యాన్ని ఎక్కువ ఖరీదుగల కంపెనీల సీసాల్లోకి మార్చి అమ్ముతారని, అంతేకాక బాటిల్‌పై రూ.30 నుంచి రూ.100 వరకు అధికంగా వసూలు చేస్తారని మందుబాబులు వాపోతున్నారు.

మద్యం వ్యాపారులు సిండికేట్



బెల్టు షాపులో మద్యం అమ్మకాలు (ఫైల్)

- గ్రామాల్లో బెల్టు షాపులకు వేలం
- అచ్యుతాపురం మండలం మార్టూరులో రూ.5.25 లక్షలకు పాట
- మిగిలిన గ్రామాల్లో కూడా వేలం పాటలకు సన్నద్ధం
- నాటుసారా కట్టడితోపాటు తమ ఆదాయం పెంచుకునేందుకు యత్నాలు

అచ్యుతాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యారు. లిక్కర్ షాపులు ఏర్పాటు చేయని గ్రామాల్లో బెల్టు అమ్మకాలకు తెరతీస్తున్నారు. ఇందుకోసం గ్రామాల వారీగా వేలం పాటలు నిర్వహించాలన్న యోచనలో వున్నారు. ఇందులో భాగంగా తొలుత మార్టూరులో గ్రామపెద్దల సమక్షంలో మద్యం బెల్టుకు వేలం పాట నిర్వహించారు. సుమారు మూడు వేల జనాభా వున్న ... మిగతా 8వ పేజీలో

విన్నపాల వెల్లువ

విశాఖలో మంత్రి నారా లోకేశ్ ప్రజా దర్బార్

- భూమి రిజిస్ట్రేషన్ కాకుండా వైసీపీ నాయకుడు అడ్డుకుంటున్నాడంటూ భీమిలి వాసి ఫిర్యాదు
- తమ భూములు ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని బర్మా కాందిశీకుల వినతి
- రెగ్యులర్ చేయాలని 2013లో రిక్రూట్ అయిన ఆర్టీసీ డ్రైవర్ల వేడుకోలు
- డిపాజిట్లు తిరిగి ఇప్పించాలని కోరిన అగ్రిగోల్డ్ బాధితురాలు
- ఉద్యోగుల కోసం విజ్ఞాపనలు
- పరిశీలించి న్యాయం చేస్తానని యువనేత హామీ



మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న విశాఖలోని బర్మా కాందిశీకులు

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): **రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ విచ్చేసిన రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. ఆయా విజ్ఞాపన పత్రాలను పరిశీలించిన మంత్రి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.**

భీమిలికి చెందిన నక్కెళ్ల సోమరాజు భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తాము కొనుగోలు చేసిన 78 సెంట్ల భూమి రిజిస్ట్రేషన్ కాకుండా వైసీపీ అండతో అక్కరమాని వెంకటరావు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. తమ భూములు ఆక్రమించుకుంటున్న, అందుకు మద్దతిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ బర్మా కాందిశీకుల కేంద్రం సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. తమకు ఆయా భూముల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. తమకు ఉపాధి కల్పించాలని, వ్యాపార నిమిత్తం రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. 2013లో రిక్రూట్ అయిన డ్రైవర్లను రెగ్యులర్ చేయాలని కోరుతూ కాంట్రాక్టు ఆర్టీసీ డ్రైవర్లు వినతిపత్రం సమర్పించారు. విశాఖ రీజియన్‌లో 2013లో ఎంపికైన తమను 2022లో విధుల్లోకి తీసుకున్నారని, దీంతో చాలా సర్వీస్ నష్టపోయామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో తమకు పీఆర్‌సీ కూడా అమలు చేయలేదని, ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నట్టు పేర్కొన్నారు. గతంలో చంద్రబాబునాయుడు అరెస్టు వార్త విని తన భర్త గుండెపోటుతో మరణించారని, దీంతో తమ కుటుంబం ఆధారం లేకుండా పోయిందంటూ అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం కొండపాలేనికి చెందిన ముచ్చకర్ల ధారాలక్ష్మి వాపోయారు. వడ్డాదిలోని కేజీబీవీలో అవకాశం కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అధికారులు చేసిన తప్పుకు తాను ఇబ్బంది పడాల్సి వస్తోందంటూ కె.చిన్నారావు అనే వ్యక్తి మంత్రికి ఫిర్యాదు చేశారు. 2012లో వుడా అనుమతులు ఉన్న 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశానని, 1981లో సొసైటీకి దాఖలైన భూమిని 35 ఏళ్ల తరువాత నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన డబ్బును అగ్రిగోల్డ్‌లో పెట్టానని, ఆ సంస్థ బోర్డు తిప్పేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు శ్రీకాకుళానికి చెందిన గంగాడ కొర్లమ్మ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తనకు డిపాజిట్ తిరిగి ఇప్పించేలా చేయలంటూ మంత్రిని ఆమె కోరారు. ఇంజనీరింగ్ ... మిగతా 8వ పేజీలో



మంత్రి లోకేశ్‌కు తన సమస్యను చెప్పుకుంటున్న మహిళ

జిల్లా మహిళా సమాఖ్య ఎన్నికల్లో గందరగోళం

ఎన్‌జీవో నిర్వహిస్తున్న మహిళ.. కార్యదర్శి పదవికి పోటీ

- పలువురు సభ్యులు అభ్యంతరం
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం
- ఎన్నికలను వాయిదా వేసిన ఏపీడీ



జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక కోసం హాజరైన సభ్యులు

సబ్బవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా మహిళా సమాఖ్య ఎన్నికలు గందరగోళం మధ్య వాయిదా పడ్డాయి. బైలా నిబంధనలు అతిక్రమించి స్వచ్ఛంద సంస్థను నడుపుతున్న వ్యక్తి జిల్లా కార్యదర్శిగా పోటీ చేయడంతో మిగతా సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చివరికి సమాఖ్య ఎన్నికను అధికారులు వాయిదా చేయడంతో సభ్యులు వెనుదిరిగారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

జిల్లా సమాఖ్య ఎన్నికల నిర్వహణను శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో చేపట్టారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒకరు చొప్పున 24 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ... మిగతా 8వ పేజీలో

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిరీక్షణ

గత విద్యా సంవత్సరం బకాయిలు రూ.2.4 కోట్లు

- ఎన్నికల ముందు రూ.60 లక్షలు విడుదల!
- ఇంతవరకు తల్లుల ఖాతాల్లో జమకాని డబ్బులు
- ఫీజులు చెల్లిస్తేనే కళాశాలకు రండి..
- తెగేసి చెబుతున్న యాజమాన్యాలు



అనకాపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): **గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు విడుదల చేయకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు రూ.2.4 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులను వైసీపీ ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎన్నికల ముందు మొక్కుబడిగా రూ.60 లక్షలు విడుదల చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ తల్లుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. ప్రభుత్వం ఇచ్చే నిధులతో తమకు సంబంధం లేదని, ఫీజు చెల్లించకపోతే కళాశాలకు రావద్దని యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి.**

తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము నేరుగా కళాశాలలకు జమ అయ్యేవి. ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తుండడంతో ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి ఉండేది కాదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును కళాశాలలకు కాకుండా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం ప్రారంభించింది. అవి కూడా సక్రమంగా విడుదల అయ్యేవి కావు. దీంతో కళాశాలలకు ఫీజు చెల్లించడంలో తీవ్రజాప్యం అయ్యేది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో ఏటా జాప్యం చేసుకుంటూ రావడం వల్ల 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక విడత నిధులు కూడా తల్లుల ఖాతాలకు జమ కాలేదు.

జిల్లాలో 175 కళాశాలల్లో చదువుతున్న 3,078 మంది ఎస్సీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2.4 కోట్లు చెల్లించాల్సి వుంది. గత ఎన్నికల ముందు ఓట్ల లబ్ధి కోసం కంటితుడుపు చర్యగా రూ.60 లక్షలు విడుదల చేసింది. కానీ తల్లుల ఖాతాలకు నగదు జమ కాలేదని తెలిసింది. సాధారణ డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఫార్మసీ, పీజీ తదితర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు.. గత ఏడాది ఫీజు మొత్తం చెల్లించిన తరువాతే కళాశాలల యాజమాన్యాలు మార్కుల జాబితాలు, టీసీ, సీసీలు వంటి ధ్రువపత్రాలు ఇచ్చాయి. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు గత ఏడాదికి సంబంధించి ఫీజు బకాయిలు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. ప్రభుత్వం విడుదల చేసే నిధులతో తమకు సంబంధం లేదని, ఫీజు చెల్లించిన తరువాత తరగతులకు హాజరు కావాలని పలు కళాశాలల యాజమాన్యాలు తెగేసి చెబుతున్నట్టు సమాచారం. ఫీజు చెల్లిస్తేనే సెమిస్టర్ పరీక్షలకు హాజరు కావాలని, లేదంటే కళాశాలకు రావద్దని కొన్ని ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తున్నదని విద్యార్థులు వాపోతున్నారు. గత విద్యా సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో మరో 200 పడకలు

జిల్లా కేంద్రం స్థాయిలో వైద్యశాల అభివృద్ధికి చర్యలు

- ఆరు నెలల్లో అందుబాటులోకి సీసీయూ బ్లాక్
- నేటి నుంచి సీటీ స్కాన్ సేవలు
- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడినప్పటికీ స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆ స్థాయిలో అభివృద్ధి జరగలేదని స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అభిప్రాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం ఆయన వైద్యాలయాన్ని తనిఖీ చేశారు. వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. సీటీ స్కానింగ్ పరికరాన్ని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం 200 పడకలు వున్నాయని, దీనిని 400 పడకలకు పెంచడానికి కృషి చేస్తామన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో సీటీ (కంప్యూటెడ్ టోమోగ్రఫీ) స్కాన్ సేవలు శనివారం నుంచి అందుబాటులోకి వస్తాయని ... మిగతా 8వ పేజీలో

ఫిష్ ఆంధ్రలో గోల్‌మాల్

మూన్నాళ్ల ముచ్చటగా చేపలు, రొయ్యల వ్యాపారం

- వైసీపీ హయాంలో పీఎంఎంఎస్‌వై కింద యూనిట్లు మంజూరు
- పార్టీ శ్రేణులకే మంజూరు... హడావిడిగా ఏర్పాటు
- కొన్నిచోట్ల యూనిట్లు ఏర్పాటు చేయకుండానే రికార్డుల్లో నమోదు
- రాయితీ సొమ్ము స్వాహా చేసినట్టు ఆరోపణలు
- విచారణ జరపాలని మత్స్యకార నేతలు ఫిర్యాదు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

మత్స్యకారుల జీవనోపాధికి కేంద్ర ప్రభుత్వం అందించే నిధులను సైతం గత వైసీపీ ప్రభుత్వం వదల్లేదు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) యూనిట్ల ఏర్పాటు ముసుగులో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం చేసి పథకం లక్ష్యానికి తూట్లు పొడిచారు. ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్ స్టాల్స్ మాటున నిధులను పక్కదారి పట్టించారు.

గ్రామాల్లో మత్స్య సంపదను స్థానిక యువత ద్వారా విక్రయించి వారికి ఆర్థిక భరోసా కల్పించాలన్నది పీఎంఎంఎస్‌వై ఉద్దేశం. యూనిట్ వ్యయం లక్ష రూపాయల నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు వుండగా, లబ్ధిదారులు మత్స్యకారులు అయితే ఇందులో 10 శాతం చెల్లిస్తే చాలు. మిగిలిన సొమ్మును ప్రభుత్వం భరిస్తుంది. ఓసీలకు 40 శాతం, ఎస్సీలకు 60 శాతం రాయితీ ఇచ్చారు. జిల్లాలో 2020-21లో కేంద్ర ప్రభుత్వ నిధులతో 'ఫిష్ ఆంధ్రా' అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేశారు. వీటిల్లో చేపలు, రొయ్యలు వంటి మత్స్య సంపదను విక్రయించాలన్నది ఉద్దేశం. తొలి విడత 120 స్టాల్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా సుమారు 90 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ.2.5 లక్షలు చొప్పున రెండు కోట్ల రూపాయలకుపైగా ఖర్చుచేశారు. అయితే చాలాచోట్ల మొక్కుబడిగా యూనిట్లు ఏర్పాటు చేసి, కేంద్రం ఇచ్చిన నిధులను వైసీపీ స్థానిక నేతలు జేబుల్లో వేసుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. కొన్నిచోట్ల యూనిట్లు ఏర్పాటు చేసినట్టు రికార్డుల్లో మాత్రమేచూపి, రాయితీ సొమ్మును స్వాహా చేశారు. ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు గ్రామంలో మత్స్యశాఖ అధికారులు మోడల్ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా స్టాల్ అలంకార ప్రాయంగా మారింది. ఇక్కడ పట్టుమని వారం రోజులు కూడా మత్స్య సంపద అమ్మకాలు జరగలేదు. రావికమతం మండలం టి.అర్జాపురం, గర్నికం గ్రామాల్లో ఒక్కో యూనిట్‌కు రూ.2.5 లక్షలు వంతున మంజూరు చేసి మూడు యూనిట్‌లు ఏర్పాటు చేశారు. కొద్ది రోజులకే అవి మూతపడ్డాయి. అచ్యుతాపురంలో మత్స్యకారులు అనాదిగా చేపల వ్యాపారం చేస్తున్నారు. వారి దుకాణాలకే 'ఫిష్ ఆంధ్రా' బోర్డులు ఏర్పాటు చేసి రాయితీ సొమ్ము మింగేశారు. ఇప్పుడు దుకాణాలకు బోర్డులు కూడా లేవు. నర్సీపట్నం ... మిగతా 8వ పేజీలో



ఎస్.రాయవరం మండలం కొరుప్రోలులో మూతపడిన ఫిష్ ఆంధ్రా స్టాల్

సెయింట్ మేరీస్ హోమ్‌ను సందర్శించిన జడ్జి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

ఎలమంచిలి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 18 :పట్టణంలోని సెయింట్ మేరీస్ హోమ్‌తో పాటు లైను కొత్తూరులోని చిల్డ్రన్స్ హోమ్‌ను ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ శుక్రవారం సందర్శించారు. సెయింట్ మేరీస్ హోమ్‌లో చదువుతున్న పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల చదువులు, వారికి కల్పిస్తున్న సౌకర్యాలు తదితరాలను నిర్వాహకులు ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కృప, న్యాయవాదులు హరిశంకరావు, పీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నతండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రికి దహన సంస్కారాలు నిర్వహిస్తున్న కుమార్తె చిలుకు

రాంబిల్లి, అక్టోబరు 18 : కన్నతండ్రికి తలకొరివి పెట్టి ఓ కూతురు రుణం తీర్చుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. మండలంలోని అప్పన్నపాలెం గ్రామానికి చెందిన బొగడకుర్తి రాము కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు. కొడుకులు లేకపోవడంతో తన పెద్ద కుమార్తె చిలుకు తండ్రికి దహన సంస్కారాలు చేసేందుకు ముందుకు వచ్చింది. శ్మశాసన వాటిక వరకు తండ్రి పాడెను మోసి, అక్కడ అతనికి చితికి నిప్పంటించింది. ఈ దృశ్యాన్ని చూసినవారంతా కంటతడి పెట్టుకున్నారు. కొడుకులు లేని లోటు ఆ తండ్రికి తీర్చిందని చర్చించుకున్నారు.

పలు బేకరీలు, కిరాణా దుకాణాలపై కేసులు

ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించడంపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆగ్రహం



ఓ దుకాణంలో సరకు నాణ్యతను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీరజ

ఎలమంచిలి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 18 : ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.నీరజ సిబ్బందితో కలిసి పట్టణంలో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలోని బేకరీలను పరిశీలించి బిస్కెట్లు, కేక్‌లు తదితర ఆహార పదార్థాల్లో వినియోగించే మైదా పిండి తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యతగా లేకపోవడంతో కేసులు నమోదు చేశారు. అలాగే, దిమిలి రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డులోని దుకాణాల్లో తనిఖీలు జరిపి మూడు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. వ్యాపారులు విధిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. ఆహార పదార్థాల తయారీలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం కంకణం

» ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



హరిపాలెంలో అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం/అచ్యుతాపురం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ చక్కని వేదిక అని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని ఖాజీపాలెం, జగ్గన్నపేట, తిమ్మరాజుపేట, హరిపాలెం, ఎర్రవరం, ఉప్పవరం, ఎంజేపురం పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. ఈ కారణంగానే ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోయాయన్నారు. దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలని, ఇటు వంటి గ్రామాలపై గత పాలకులు తీవ్రంగా నిర్లక్ష్యాన్ని చూపించారని దుయ్యబట్టారు. దీంతో సర్పంచ్‌లకు విలువలేకుండా పోయిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగానే పల్లె పండుగ కార్యక్రమాన్ని రూపొందించినట్టు చెప్పారు. అలాగే రైతులకు మేలు జరిగే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను కూడా రూపొందించామన్నారు. అనంతరం ఆయన పలచోట్ల సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే, గర్భిణులు, బాలింతలకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులతో పాటు కూటమి నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, పీలా తులసీరామ్, జనపరెడ్డి నర్సింగరావు, కాండ్రేగుల సూర్యనారాయణ, ద్వారపురెడ్డి బాపూజీ, కరెడ్ల సూర్యప్రకాశరావు, మోటూరు శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో

ఎలమంచిలి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 18 : ఇక్కడి కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో వెంకట లక్ష్మమ్మ శుక్రవారం సందర్శించారు. తొలుత రికార్డులు పరిశీలించి, మరుగుదొడ్ల నిర్వహణ తదితరాలు హెచ్‌ఎం రమణ ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేసి దిశానిర్దేశం చేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

అచ్యుతాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శనివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ రాజశేఖర్ తెలిపారు. మడుతూరు, ఎరికిరెడ్డి పాలెం, రాజానపాలెం, తంతడి, వాడ్రాపల్లి, అంగవానిపాలెం, దాసరి పాలెంలో ఉదయం తొమ్మిదినుంచి సాయంత్రం నాలుగు వరకు సరఫరా ఉండదన్నారు.

వార్డు సభ్యులకు ముగిసిన శిక్షణ తరగతులు

రాంబిల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వార్డు సభ్యుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో జయమాధవి మాట్లాడుతూ పంచాయతీల ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, ప్రభుత్వాల పథకాలు, పంచాయతీల ఆస్తులు, వాటి పరిరక్షణ తదితర అంశాలపై వివరించారు. ఈవోపీఆర్‌డీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో నీటి శుద్ధి ప్లాంట్‌కు సన్నాహాలు

» మునిసిపాలిటీలో అనువైన స్థలాలను పరిశీలించిన ఆర్డీవో, తహసీల్దార్



పెంజెరువు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ఆయేషా తదితరులు

ఎలమంచిలి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 18 : మునిసిపాలిటీలో నీటి శుద్ధీకరణ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాలను శుక్రవారం అనకాపల్లి ఆర్డీవో ఆయేషా పరిశీలించారు. పట్టణ సమీపంలోని పెంజెరువు, శేషుకొండ, పెదపల్లి తదితర ప్రాంతాలకు ఆమె తహసీల్దార్ వరహాలు, టీపీవో శ్రీలక్ష్మిల తదితరులతో కలిసి వెళ్లారు. అక్కడి స్థలాలను పరిశీలించి, వాటి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. మునిసిపాలిటీ ప్రజల సౌకర్యార్థం నీటి శుద్ధీకరణ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ ముందుకు రావడంతో ఈ స్థల పరిశీలన జరుపుతున్నారు.

విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ ఆపాలి

» సీపీఎం నాయకులు డిమాండ్

» సబ్ స్టేషన్ వద్ద ధర్నా



సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం, అక్టోబరు 18 : విద్యుత్ నియంత్రణ మండలి చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇక్కడి సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రెండు కోట్ల మంది విద్యుత్ వినియోగదారుల నుంచి ఇంధన సర్దుబాటు పేరుతో విద్యుత్ నియంత్రణ మండలి భారీగా వసూలు చేయడానికి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తోందన్నారు. దీనివల్ల వినియోగదారులపై అదనపు భారం పడనుందని ఆరోపించారు. సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ చార్జీలు పద్ధతి ప్రపంచంలో ఎక్కడా లేవన్నారు. వెంటనే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొంగలి రాము, కె.సోమునాయుడు, కర్రి అప్పారావు, కె.రామసదాశివరావు, ఎస్.కన్నుంనాయుడు, బుద్ద రంగారావు, ఆర్.లక్ష్మి, రావి దేవుళ్లు, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలు.. అద్భుత ఆవిష్కరణలు

» వైజ్ఞానిక ప్రదర్శనలో చక్కని నమూనాలతో ఆకట్టుకున్న గురుకుల పాఠశాలల విద్యార్థులు



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన నమూనాలు



ఎలమంచిలి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 18 : పట్టణ పరిధి కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో శుక్రవారం ఏర్పాటైన ఉమ్మడి జిల్లా గురుకులాల వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో పాల్గొన్న విద్యార్థులు కొత్త ఆలోచనలతో అద్భుతాలను సృష్టించేలా నమూనాలను ప్రదర్శించారు. అంతేకాకుండా వీటి పనితీరును చక్కగా వివరించారు. పర్యావరణ రహిత గ్రామాల నిర్మాణం, సోలార్ విద్యుత్ తయారీ, తాగునీరు శుద్ధి చేసే ప్రాజెక్టు, స్మార్ట్ హోమ్ తదితర నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉమ్మడి జిల్లాలోని పదకొండు గురుకుల పాఠశాలలు నుంచి రెండు వందల మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇందులో ఎంపికైన ప్రాజెక్టులను జోనల్ స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని ప్రిన్సిపాల్ మాణిక్యం తెలిపారు. న్యాయనిర్ణేత సమక్షంలో విజేతలను ఎంపిక చేయనున్నామన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు



అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రాంబిల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే అనంతరం నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలు అంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కొట్టుబోలు గ్రామంలో శుక్రవారం ఏర్పాటైన గ్రామ సభలో మాట్లాడారు. రెవెన్యూ పరమైన సమస్యలను సభ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కారిడార్ రైతులనుద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింహమూర్తి

కారిడార్ రైతులతో తహసీల్దార్ సమావేశం

నక్కపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా భూములు ఇచ్చిన రైతులతో శుక్రవారం చందనాడలో తహసీల్దార్ నరసింహమూర్తి గ్రామసభ నిర్వహించారు. రైతు సంఘ ప్రతినిధులు గంటా తిరుపతిరావు, తళ్లా భార్గవ్ తదితరులు మాట్లాడుతూ కొన్ని సాగు భూములకు, రైతుల సాగులో వున్న మరికొన్ని భూములకు పరిహారం ప్యాకేజీ ఇవ్వాలని, గృహాలకు కూడా పూర్తి ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. నష్టపరిహారం, ప్యాకేజీ కటాఫ్ డేట్‌ను మార్చాలని విన్నవించారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ పర్రా భూములకు, వాటర్‌బాడీ భూములు, కొన్ని సాగుభూములకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పరిహారం ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. అలాగే కటాఫ్ డేట్ కూడా మార్చే అవకాశం ఉందన్నారు. అయినప్పటికీ రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన చెప్పారు.

'కంభంపాటి' సేవలు అభినందనీయం



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న తోట నగేశ్

పాయకరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కంభంపాటి వెంకటరమణ అందిస్తున్న సేవలు అభినందనీయని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు సహస్ర హస్పటల్ సమకూర్చిన వాటర్ ట్యాంకును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంభంపాటి వెంకటరమణ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూనే పట్టణంలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి తన వంతు కృషిచేస్తున్నారని అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యకమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఫైర్ ఆఫీసర్ రాంబాబు, పాండురంగస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ల వరహాలు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, నాయకులు వేముల వెంకటేశ్వరరావు, ఆది, పెదపాటి మేఘరంజన్, ఇంజరపు సూరిబాబు, కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి బంగారం వితరణ

ఎస్.రాయవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులపాడు గ్రామంలో నూకాంబిక అమ్మవారికి విశాఖ డెయిరీ పాల సొసైటీ అధ్యక్షుడు సేనాపతి రమణ ఐదు గ్రాముల బంగారాన్ని వితరణ అందించారు. అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులకు బంగారాన్ని అందజేశారు. విశాఖ డెయిరీ యాజమాన్యం తనకు నజరానాగా అందించిన ఈ ఏడాది ఐదు గ్రాముల బంగారాన్ని రమణ తమ గ్రామ దేవత నూకాంబి అమ్మవారికి వితరణగా అందజేయడమే కాకుండా గత ఏడాది ఇచ్చన ఐదు గ్రాముల బంగారాన్ని కూడా ఇచ్చారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు రమణను గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులతో పాటు గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సమ్మింగి లక్ష్మీనారాయణ, సమ్మింగి నూకరాజు, పోచిన నూకరాజు, నక్కా శ్రీనివాసు, సమ్మింగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాల్మన్‌పేట సర్పంచ్ సస్పెన్షన్ ఎత్తివేస్తూ హై కోర్టు ఉత్తర్వులు



కోడ కోటేశ్వరరావు

పాయకరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావును మూడు నెలల పాటు సర్పంచ్ పదవి నుంచి సస్పెండ్ చేస్తూ గత నెలలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి జారీ చేసిన ఉత్తర్వులను శుక్రవారం హైకోర్టు కొట్టివేసింది. పాల్మన్‌పేట సర్పంచ్ కోటేశ్వరరావు సాల్వేషన్ సర్టిఫికెట్లు జారీచేసి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు రుజువైందని గత నెలలో ఆయనను సర్పంచ్ పదవి నుంచి మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తూ డీపీవో ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై హై కోర్టును ఆశ్రయించడంతో గతంలో తనను సర్పంచ్ పదవి నుంచి సస్పెండ్ చేస్తూ డీపీవో ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ శుక్రవారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్టు కోడ కోటేశ్వరరావు తెలిపారు.

వినియోగంలోకి సంపద తయారీ కేంద్రాలు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్రశేఖరరావు సూచించారు. మండలంలోని అరట్లకోట గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్లపై ఉన్న చెత్త, చెదారాలను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వలన పంచాయతీలకు ఆదాయంతో పాటు గ్రామం పరిశుభ్రతే ప్రభుత్వం ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.అప్పలనర్స పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పిదాల పరిష్కారానికే గ్రామ సభలు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భూములు రీ సర్వేలో తప్పిదాల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తున్నదని తహసీల్దార్ సత్యనారాయణ చెప్పారు. కందిపూడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రీ సర్వేలో భూ విస్తీర్ణం, ఫొటో మిస్ మ్యాచింగ్ వంటి సమస్యలు ఉంటే గ్రామ సభ దృష్టికి తీసుకురావాలని, 15 రోజులలో వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. కందిపూడి సభలో 26 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.





పాయకరావుపేట: శ్రీరాంపురంలో పల్లె అభివృద్ధి పనులకు శంకుస్థాపన... ఎస్.రాయవరం: లింగరాజుపాలెంలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న నాయకులు

'పల్లె పండుగ'తో గ్రామాల అభివృద్ధి

» టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టిబాబు

» నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. నియోజకవర్గం కేంద్రం పాయకరావుపేటతో పాటు ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. పాయకరావుపేటలోని పాల్తేరు, శ్రీరాంపురం గ్రామాలలో నిర్వహించిన సభల్లో చిట్టిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, కాలువలు, గోకులం షెడ్లు తదితర నిర్మాణ పనులు ప్రారంభమవుతున్నాయని చెప్పారు. గ్రామసభలలో తీర్మానం చేసిన మేరకు ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో శ్రీరాంపురంలో రూ.13.5 లక్షలు, పాల్తేరులో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్టు ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో హేమలత, పీఆర్ ఏఈ కచేరి, సర్పంచులు గారా కృష్ణప్రసాద్, గోసలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు ఎం.చిట్టిబాబు, నాయకులు డి.రాజాబాబు, సిహెచ్.రాంబాబు, ప్రదీప్, బి.కాశీవిశ్వనాథ్, డి.శివరాజు, డి.జగదీష్, సత్తిబాబు, తలారి రాజా, జనసేన నేత డి.రఘు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని అయ్యన్నపాలెం, రాజయ్యపేట, పెదతీనార్ల, చందనాడ, బుచ్చిరాజుపేట గ్రామాల్లో శుక్రవారం పల్లె పండగ నిర్వహించారు. ఎంపీడీవో డి.సీతారామరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యులు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో సర్పంచులు అప్పలనర్స, పి.వీరబాబు, ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, మత్స్యకార నాయకులు పిక్కి రాంబాబు, గంగరాజు, కోదండరావు, జి.సింహాద్రి, జనసేన నేత పి.కోదండరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. రాజుపేట ఆరు పనులకు రూ.10.35 లక్షలు, పాములవాక ఆరు పనులకు రూ.9.3 లక్షలు, బోడపాలెం ఒక పనికి రూ.6 లక్షలు, పీకేపల్లి గ్రామాల్లో మూడు పనులకు రూ.5 లక్షలు చొప్పన కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెట్లలింగం నాయుడు, వి.జనార్దన్, భాస్కరరావు, ఎంపీడీవో కాశీవిశ్వనాథం, మండల ఇంజనీర్ వర్మ, ఏపీవో నాగరాజు, ఎంపీటీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పల్లె పండగను ఘనంగా నిర్వహించారు. సైతారుపేట, సర్వసిద్ధి, లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, వెంకటాపురం, వాకపాడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.అబద్దం, మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు భూమి పూజ చేశారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాలన్నీ అభివృద్ధి చెందనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రం రామకృష్ణ, తుంపాల నాగేశ్వరరావు, ఆర్.రమణబాబు, డి.గణపతిరాజు, శ్రీనివాసరావు నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను 15 రోజుల్లో పరిష్కరిస్తాం



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ తిరుమలబాబు

కోటవురట్ల, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో లోపాలపై వచ్చిన ఫిర్యాదులను 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు. రాజుపేట సచివాలయంలో శుక్రవారం నిర్వహించి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రీ సర్వే చేసినప్పుడు భూమి విస్తీర్ణంలో తప్పులు, హెచ్చుతగ్గులు, పేరు మార్పులు తదితర అంశాలపై సభల్లో దరఖాస్తులను స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సభలో రైతుల నుంచి 21 ఫిర్యాదులు అందాయన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్, సర్వేయర్ శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటరమణ, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నక్కపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. మనబాలవానిపాలెం గ్రామానికి చెందిన కొర్రా శ్రీను బైక్‌పై బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా, బైక్‌పై విజయవాడ వెళ్తున్న వినోద్ ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కోటవురట్ల, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్ సూచించారు. శుక్రవారం పాములవాక జడ్పీహెచ్ పాఠశాలలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ క్రైమ్, పోక్సో, ఈవ్ టీజింగ్, రోడ్డు ప్రమాదాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాల కల్ల కలిగే అనర్థాలను వివరించారు. సెల్‌ఫోన్ ఎక్కువ వినియోగిస్తే ఆరోగ్యం దెబ్బ తింటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఏఎస్ఐ గంగారాజు పాల్గొన్నారు. కాగా, పోలీసు స్టేషన్ వద్ద ఉన్న ఇసుక నిల్వలకు శనివారం ఉదయం వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ నాయకులకు సత్కారం

నక్కపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెదతీనార్ల గ్రామంలో పలువురు టీడీపీ నాయకులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ జి.చినతాతారావు నేతృత్వంలో నాయకులు, మత్స్యకార పెద్దలు సత్కరించారు. నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జికి సత్కారం జరిగింది. ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

» అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు



సబ్బవరం శివారు గోపాల్‌నగర్‌లో సీసీ రోడ్డు శంకుస్థాపనలో ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం, అక్టోబరు 18 : పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని తవ్వవానిపాలెం, అమృతపురం, పెదగొల్లలపాలెం, అసకపల్లి, బాటజంగాలపాలెం, సబ్బవరం, ఎల్లుప్పి, బోదివలస, గుల్లేపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.2.89 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా నెరవేరుస్తామన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్ ఈ రాష్ట్రాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి. పద్మజ, తహసీల్దార్ చిన్నికృష్ణ, సర్పంచ్‌లు బోకం స్వామినాయుడు, కర్రి నర్సింగరావు, పడాల శ్రీను, నేబర్తి శ్రీను, బండారు మంగ, ఎంపీటీసీలు ఉగ్గిన రాము, శింగంపల్లి శ్రీను, కూటమి నేతలు ఇందలి రమణ, రోమాల చంద్రశేఖర్, గండి ముత్యాలనాయుడు, పల్ల తాతారావు, కర్రి కనకరాజు, బంతికోళ్ల పద్మ, టి.శేఖర్, జెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



గౌరీ పరమేశ్వరులకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయిలు ఆదిదంపతులకు ప్రత్యేక పూజలు జరిపారు. ఎన్టీఆర్ మార్కెట్‌యార్డు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కాండ్రేగుల సత్యనారాయణ, ఎంవీ లోవరాజు, కాండ్రేగుల గంగరాజులతో పాటు పలువురు మహిళలు ఊంజల్ సేవ చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారకు

రోటరీ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పదిహేను మంది పేద మహిళలకు రోటరీ జిల్లా గవర్నర్, రోటరీ ప్రతినిధి దత్త సుబ్బారావు చేతుల మీదుగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. రోటరీ కల్యాణ మండపంలో కొన్నిరోజుల పాటు వీరికి ఉచితంగా శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా వీరికి మిషన్లతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ పేద మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. క్లబ్ ప్రతినిధులు సరిపల్లి రాజేష్, అనిల్, కడిమిశెట్టి సతీష్, బుద్ధ రమణాజీ, రాజేశ్వర ప్రసాద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



వాగు భూమిలో బోర్డు ఏర్పాటు దృశ్యం

సబ్బవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో విలువైన ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ సూచన మేరకు ఆర్ఐ బి.వీరయ్య సిబ్బందితో వెళ్లే సర్వే నెంబరు 449లోని ప్రభుత్వ భూమి 6.07 ఎకరాలు, సబ్బవరం సర్వే నెంబరు 277/1ఎలో వాగు పోరంబోకు 9.32 ఎకరాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిన్నికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా సదరు స్థలాల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తొలగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు లోకేశ్, ఇందిర, సిబ్బంది అప్పారావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి ఇబ్బందే!



మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిలిచిపోయిన వర్షపునీరు

పరవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వర్షం వస్తే ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. కార్యాలయ ప్రాంగణమంతా నీటితో నిండిపోతోంది. దీనికితోడు కార్యాలయం లంకెలపాలెం, పరవాడ ప్రధాన రహదారికి ఆనుకుని ఉంది. ప్రధాన రహదారి గుండా బొగ్గు లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో దుమ్ము ధూళి కార్యాలయం ప్రాంగణంలోకి వచ్చి పడుతుంది. వర్షం వచ్చే సమయంలో బొగ్గు ధూళి కారణంగా వర్షపునీరంతా నల్లగా మారిపోతుంది. దీంతో కార్యాలయ ప్రాంగణమంతా నల్లనీటితో దర్శనమిస్తుంది. ఈ కారణంగా కార్యాలయం లోపలకి వెళ్లేందుకు ఇటు అధికారులు, సిబ్బందితో పాటు వివిధ పనుల పై వెళ్లే వారు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్న ఎంఈవో కార్యాలయ సిబ్బందికి కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

దుర్భరంగా మారి నది

» పరమ అధ్వానంగా శారదా ఘాట్ » ఎటు చూసినా పేరుకుపోయిన చెత్తాచెదారం » స్నానాలకు వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు





శారదా నది, ఘాట్ వద్ద చెత్తా చెదారం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శారదానది ఘాట్ అధ్వానంగా మారింది. నదిలో, బయట చెత్తాచెదారం పేరుకుపోయి ఉంది. ఈ కారణంగా భక్తులు స్నానాలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వినాయక ఘాట్ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనాలు జరిగినప్పుడు జీవీఎంసీ అధికారులు చొరవ తీసుకుని పూజా సామగ్రి నదిలో కలపనీయకుండా ప్రత్యేక వాహనం ఏర్పాటు చేశారు. అందులో వేసి ఇతర ప్రాంతాలకు తరలించారు. అయితే ఘాట్‌కు ఆనుకుని పేరుకుపోయిన చెత్తాచెదారం అక్కడే ఉండిపోయింది. ఇటీవల శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో పట్టణ పరిసర ప్రాంతాల్లో కొలువుదీరిన దుర్గామాత విగ్రహాలను పెద్ద సంఖ్యలో నిమజ్జనాలు చేశారు. భారీ విగ్రహాలను పాత శారదా నది వంతెన పైనుంచే నిమజ్జనం చేయడం వల్ల విగ్రహాలకు ఉన్న మట్టంతా కరిగిపోయి కలప ఎక్కడికక్కడ నిలిచిపోయి ఉంది. ఘాట్‌కు ఆనుకుని చెత్తాచెదారంతో పాటు భవానీమాలలు ధారణ చేసిన భక్తులు మాలలు విసర్జన చేసిన తరువాత ఆ బట్టలను ఘాట్‌కు ఆనుకుని వదిలేయడం వల్ల ఎక్కడికక్కడ నది ప్రాంతమంతా దుర్భరంగా మారింది. ప్రస్తుతం అయ్యప్ప మాలధారణ సీజన్ ప్రారంభం కావడంతో చాలా మంది భక్తులు నిత్యం నదిలో స్నానం చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అయితే నది వద్దకు వచ్చేసరికి స్నానమాచరించడానికి లోపలకి వెళ్లి వద్దామంటే ఇక్కడి తాజా వాతావరణం వారిని ఇబ్బందులకు గురిచేస్తోంది. నది ప్రవాహం అంతంత మాత్రంగానే ఉండడంతో చెత్తాచెదారం దిగువ ప్రాంతానికి కొట్టుకుపోయే పరిస్థితులు లేవు. దీంతో ఎటు చూసినా అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. మరో పక్షం రోజుల్లో కార్తీకమాసం ప్రారంభం కానుంది. పట్టణంలోని చాలా మంది శారదా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి నది ఒడ్డున ధూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహిస్తుంటారు. తక్షణమే జీవీఎంసీ అధికారులు స్పందించి నది ఘాట్‌ను పరిశుభ్ర పరిచి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పట్టణవాసులంతా కోరుతున్నారు.



బ్రిడ్జి కింద కుప్పలుగా ఉన్న వ్యర్థాలు

భూ సమస్యలు పరిష్కరిస్తాం

» రెవెన్యూ గ్రామ సభల్లో అధికారులు వెల్లడి » పలు చోట్ల నిరసన స్వరాలు



కుంచంగి గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్ఐ రమేష్



అనకాపల్లి మండలం కోడూరులో కొత్తగా భూ సమీకరణ వద్దంటూ గ్రామ రైతులు నినాదాలు

అనకాపల్లి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడూరు పంచాయతీలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించేందుకు వచ్చిన అధికారులకు చుక్కెదురైంది. గతంలో సర్వే నంబరు 20లోని 39.38 ఎకరాల్లో గ్రామానికి చెందిన రైతులు డి.ఫాంలో ఉన్నట్టు గుర్తించి సాగులో ఉన్న రైతులకు ప్రొసిడింగ్స్ కూడా జారీ చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు అదే రైతులు సాగులో ఉన్నప్పటికీ మళ్లీ రెవెన్యూ అధికారులు భూ సమీకరణ పేరుతో సర్వే చేసేందుకు రావడంపై గ్రామస్థులు, రైతులు అభ్యంతరం తెలిపారు. గతంలో చేసిన సర్వే ఆధారంగా తమకు న్యాయం చేయాలని మరలా ఇప్పుడు సర్వే చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. దీంతో చేసేది లేక రెవెన్యూ అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్లి అప్పలరాజు, లాలం నాయుడుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

కుంచంగి సభలో 154 అర్జీలు స్వీకరణ

కొత్తూరు : కుంచంగి గ్రామ సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఆర్ఐ రమేష్ హాజరై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా 154 మంది తమ సమస్యలను విన్నవించారు. గ్రామంలో భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాల్లో లబ్ధిదారుల పేర్లు తప్పులుగా ఉన్నాయని, మరికొంత మందికి ఆన్‌లైన్‌లో పేర్లు చేర్చాలని తెలియజేశారు. ఇదిలావుంటే ఈ గ్రామ సభ సచివాలయంలోని చిన్న గదిలో ఏర్పాటు చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశంలో ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యవంతంగా ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు కృష్ణ, ఈశ్వరరావు, భరద్వాజ్, సచివాలయ సర్వేయర్లు, కూటమి నాయకులు పల్లెల నాగేశ్వరరావు, రొంగలి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరం మండలం పైడివాడలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

పైడివాడ సభకు 84 అర్జీలు..

సబ్బవరం : రీ సర్వేలో చోటుచేసుకున్న భూ సమస్యలు రెవెన్యూ గ్రామ సభల ద్వారా పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. మండలంలోని పైడివాడ గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా 84 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు సీహెచ్. అప్పారావు, గణేష్, సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, ఎంపీటీసీ శీరం అప్పలరాజు, సర్వేయర్లు ఎల్.అప్పారావు, లోకేశ్, వీఆర్వో సౌజన్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

మునిసిపల్ టీచర్ల సమస్యలపై నిరసన



సీఐటీయూ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం ఇక్కడి సీఐటీయూ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబట్టి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మునిసిపల్ హైస్కూళ్లలో ఇప్పటికీ మంది సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదని వాపోయారు. పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లు మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈవో పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ టీచర్ల పీఎఫ్ ఖాతాలు మున్సిపాలిటీల్లో నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. టీచర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, జీఎస్ ప్రకాష్, శేషుకుమార్, యల్లయ్యబాబు, ఎంవీ అప్పారావు, అక్కునాయుడు, రాజునాయుడు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పరవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యంపై వార్డు సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్ సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏఏ పనులు చేపడుతున్నామో అన్న విషయాలను సర్పంచ్, కార్యదర్శులను అడిగి తెలుసుకోవాలన్నారు. పంచాయతీ విస్తరణ అధికారి ధర్మారావు మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత, అభివృద్ధి పనుల్లో వార్డు సభ్యుల భాగస్వామ్యం, తాగునీటి సరఫరా అంశాలపై అవగాహన కల్పించారు.

నేడు మూడు గ్రామాల్లో సభలు

కశింకోట, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : మోసయ్యపేట, అచ్చెర్ల, జి.భీమవరంలలో శనివారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎంపీడీవో ఎ.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నామని వివరించారు.

'నట్టల నివారణ మందుతో గొర్రెలు, మేకలకు మేలు'



గొబ్బూరులో మేకకు నట్టల నివారణ మందు వేస్తున్న వైద్యాధికారిణి చైతన్యమణి

కశింకోట/కొత్తూరు, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను ఆయా పెంపకందారులు విధిగా వేయించాలని అనకాపల్లి జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ రామ్మోహనరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.సౌజన్య సూచించారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లో శుక్రవారం నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ మందు వేయడం వల్ల జీవాలు ఆరోగ్యంతా ఉంటాయన్నారు. అనకాపల్లి మండలం టి.సీతానగరం, మాకవరం, సుందరయ్యపేట గ్రామాల్లో ఇప్పటి వరకు 440 గొర్రెలకు, 320 మేకలకు, కశింకోట మండలంలో 750 గొర్రెలకు, 400 మేకలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. ఇదిలావుంటే, గొబ్బూరులో నట్టల నివారణ మందులు వేసే కార్యక్రమాన్ని డాక్టర్ చైతన్యమణి ప్రారంభించారు. ఈ మందు వేయడం వల్ల పొట్టేలు సగటున రెండు కేజీల అధిక బరువు పెరిగి పదిశాతం ఎక్కువ లాభాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది రూపావతి తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి'



ధ్యాన కేంద్రం వార్షికోత్సవంలో ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) బుద్ధ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ సారథ్యంలో త్రిపురసుందరి పిరమిడ్ ధ్యాన కేంద్రం రెండో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఇక్కడ నిర్వహించారు. తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి బొడ్డేడ మురళీ మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాసన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలన్నారు. పిరమిడ్ ధ్యాన కేంద్రం వ్యవస్థాపకురాలు కోరిబిల్లి అచ్యుత నరసింగరావు, నందన వనం ముఖ్య సలహాదారుడు కాండ్రేగుల భాస్కరరావులతో పాటు మహిళలు పాల్గొన్నారు

కూండ్రంలో రాష్ట్ర స్థాయి బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

» హోరాహోరీగా సాగిన పోటీలు » ఒక్కో విభాగం నుంచి 14 మంది క్రీడాకారులు ఎంపిక





రాష్ట్రస్థాయికి ఎంపికైన బాల, బాలిక జట్లతో పోటీల నిర్వాహకులు

కొత్తూరు, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కూండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్ల ఎంపికను చేపట్టారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన 17 ఏళ్ల లోపు బాల బాలికలకు కబడ్డీ పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హోరాహోరీగా ఈ పోటీలు సాగాయి. ఒక్కో విభాగంలో 12 మంది ప్రధాన క్రీడాకారులతో పాటు ఇద్దరు అదనపు క్రీడాకారులను ఎంపిక చేశారు. 14 మంది చొప్పున ఎంపిక చేసిన ఈ క్రీడాకారులు త్వరలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయిలో బాలుర, బాలికల పోటీల్లో తలపడనున్నారని అనకాపల్లి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు తెలిపారు. తొలుత ఈ పోటీలను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నందారపు సూరిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.కె.భాస్కరం, పీఈటీలు కేఎం నాయుడు, కె.ధనుంజయరావు, వెంకట్రావు, సన్యాసినాయుడు, ముత్యం శ్రీను, రాజాలతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మంప ఎస్ఐగా శంకరరావు



మంప ఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించిన శంకరరావు

కొయ్యూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న మంప ఎస్ఐ పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. విశాఖ టూ టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న కె. శంకరరావు ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. మంప ఎస్ఐగా పని చేసిన లోకేశ్‌కుమార్ సాధారణ బదిలీలలో భాగంగా విజయనగరం జిల్లా చీపురుపల్లి సర్కిల్ పరిధి బుదరాయివలస స్టేషన్‌కు ఆగస్టులో బదిలీ అయ్యారు. అప్పటి నుంచి కొయ్యూరు ఎస్ఐలు మంప స్టేషన్ అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో మావోయిస్టు ప్రాబల్యప్రాంతాల పంచాయతీల్లో శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలు కష్టంగా మారాయి. దీంతో ఎట్టకేలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ స్టేషన్‌లో శంకరరావు గురువారం నుంచి విధులకు హాజరయ్యారు.

కొయ్యూరు ఎస్ఐగా కిశోర్ వర్మ

కొయ్యూరు ఎస్ఐగా శ్రీకాకుళం రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న కిశోర్‌వర్మ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి ఎస్ఐగా నెల రోజులుగా పని చేస్తున్న నాగార్జున ను జిల్లాలో ఎటపాక స్టేషన్‌ను కేటాయించినట్టు తెలిసింది. సోమవారం కిశోర్ వర్మ కొయ్యూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించనున్నట్టు సమాచారం.

అరకులోయను పరిశుభ్రంగా ఉంచాలి



జెడ్పీ సీఈవో నారాయణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

అరకులోయ, అక్టోబరు 18,(ఆంధ్రజ్యోతి): అరకులోయ, పరిసరాల్లోని పర్యాటక స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉమ్మడి విశాఖజిల్లా జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి మండల అధికారులకు ఆదేశించారు. శుక్రవారం అరకులోయ మండల ప్రజాపరిషత్ ఆఫీసుకు విచ్చేసిన సీఈవో అధికారులతో మాట్లాడారు. దేశ, విదేశాలనుంచి పర్యాటకులు వస్తున్నందున పంచాయతీలో పారిశుధ్యపనులు చేపట్టాలన్నారు. ఉపాధి పనుల వివరాలను ఎంపీడీవో లవరాజు సీఈవోకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీఅతిథిగృహం మరమ్మతు పనులను పరిశీలించారు. పెదలబుడు గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ అభివృద్ధి చేయాలన్నారు. సీఈవోను ఎంపీడీవో లవరాజు, కార్యదర్శులు, సిబ్బంది మొక్కను అందించి సత్కరించారు.

మారుమూల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం

అనంతగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ చినకోనెల, బూరుగు, సీమిడివలస, రాయపాడు, డెంజనివలస, బొంగిజ, పెదవలస గ్రామాల్లో పీఎం జన్మన్ పథకం ద్వారా రూ. 79 లక్షలతో విద్యుత్ సౌకర్యం కల్పించినట్టు విద్యుత్‌శాఖ ఈఈ ఏఈఎస్ఎం అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గిరిజనులకు ఈ విద్యుత్ సదుపాయం కల్పించినట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లో గిరిజనులకు మీటర్లకు కోసం దరఖాస్తులు చేయించి, విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం ఇళ్లకు కనెక్షన్ ఇచ్చినట్టు పేర్కొన్నారు.

లాప్‌ట్యాప్‌లకు దివ్యాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పీజీ, ఇంజనీరింగ్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు లాప్‌టాప్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయో వృద్ధుల సంక్షేమశాఖ జిల్లా సహాయ సంచాలకురాలు జె.మాధవి కోరారు. లాప్‌టాప్ కావలసిన విద్యార్థులు 40 శాతం ఆపై దివ్యాంగత్వం, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షలులోపు ఉండాలన్నారు.

వాలీబాల్ మైదానం అభివృద్ధికి సహకరించాలి

అరకులోయ, అక్టోబరు 18,(ఆంధ్రజ్యోతి): స్థానిక వాలీబాల్‌గ్రౌండ్‌లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పనకు పట్టణవాసులతో పాటు దాతలు సహకరించాలని ఓల్డ్ స్టూడెంట్స్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు కొర్రా మధుసూదనరావు కోరారు. ప్రస్తుత జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణీ క్రీడాకారుల సౌకర్యార్థం తన నిధుల నుంచి బోరు,మంచినీటి ట్యాంకుమంజూరు చేశారన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బురిడి ఆనందరావు, పౌలు మాస్టారు, వర్తకసంఘం ప్రతినిధులు మయూరి రాజారావు, కాపుగంటి కృష్ణారావు, గెమ్మెల బాబురావు, రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం తగదు: సీపీఎం

చింతపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ట్రూ ఆఫ్ చార్జీల పేరిట వినియోగదారులపై భారం వేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రం ఎదుట నాయకులు, గిరిజనులు ఈమేరకు ఆందోళన చేపట్టారు. నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి పాల్గొన్నారు.

కొయ్యూరు: సీపీఎం నేతలు ఎస్ సూరిబాబు, పి రాంబాబు, పి. గంగరాజు ఆధ్వర్యంలో కాకరపాడు సబ్ స్టేషన్ ఆవరణలో ఈ మేరకు ధర్నా నిర్వహించారు.



ముంచంగిపుట్టు మండలం సుత్తిగూడ ప్రధాన రహదారి దుస్థితి



పెదబయలు మండలం జముదాంగి రోడ్డుపై వాహనచోదకుడి పాట్లు

నరకానికి నకళ్లు.. నడిచేదారేదండి..?

- అధ్వానంగా గిరిజన గ్రామాల్లో రహదారులు
- ఇటీవల వర్షాలకు మరీ దారుణంగా మారిన వైనం
- గిరిపుత్రుల రాకపోకలకు అవస్థలు..డోలీల మోతలు
- పట్టించుకోని అధికారులు

గిరిపుత్రుల జీవనం ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ఏళ్లు గడుస్తున్నాయి.. ఐదేళ్లకోసారి పాలకుల ముఖాలు మారుతున్నాయి. గిరిజనుల జీవితాల్లో మాత్రం వెలుగు కానరావడంలేదు. సాంకేతికంగా ఎంతో ప్రగతి సాధించామని గొప్పలు మినహా.. గిరి గ్రామాల్లో డోలీ మోతలు తప్పడంలేదు. రహదారుల అధ్వానంతో నిత్యం ఇలాంటి దృష్టాంతాలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి.

పెదబయలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కనీస సౌకర్యాలులేక గిరిజన తండాల్లో గిరిపుత్రులు అవస్థల మధ్య జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మండలంలోని ఇంజరీ పంచాయతీలోని జమదాంగి, తగ్గపాడు, కోటపల్లి, గజ్జెడి, దొంతురాయి, బంగారుకొండా గ్రామాలు ఇంతవరకు పక్కా రహదారికి నోచులేదు. కోండ్రు గ్రామం నుంచి సుమారు 8 కిలోమీటర్ల రోడ్డు లేక గర్భిణులు, అనారోగ్యం బారినపడుతున్నవారు ఆస్పత్రికి చేర్చాలంటే డోలీలే దిక్కవుతున్నాయి. కీకర అరణ్యాల మధ్య రోగులను మోసుకుంటూ ఆస్పత్రికి చేర్చాల్సి ఉంటోంది. సకాలంలో వైద్యం అందక అనేక మందిని కోల్పోయినట్టు గిరిజనులు వాపోతున్నారు. అదే తమ గ్రామాలకు రోడ్డు సదుపాయముంటే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండేది కాదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ గ్రామాల ద్వారానే ఒడి శా రాష్ట్రం సరిహద్దు గ్రామాలకు సులువుగా చేరుకోవచ్చు. పంచాయతీ, మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా, తమ గోడును వినే నాథుడు కరువయ్యారని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈస్థితి లో ఆయా గ్రామాల గిరిజనుల చొరవ తీసుకుని నడవటానికి వీలుగా రెండడుగుల వెడల్పు గల చిన్న బాటను శ్రమదానంతో నిర్మించారు. అత్యవసర సమయాల్లో ఈ దారిలోనే ద్విచక్ర వాహనాలపై రోగులను ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి తమ గ్రామాలకు పక్క రోడ్డు సదుపాయం కల్పించాలని ఇంజరీ పంచాయతీ సర్పంచ్ గెమ్మెలి రవణమ్మ, గిరిజనులు వెంకటరావు, నూకరాజు, పేత్రు, కళ్య ఇర్మియ, శ్రీను, మహేంద్ర తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

ముంచంగిపుట్టు మండలంలో..

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ సుత్తిగూడ గ్రామంలో పక్కా రహదారి మట్టి రహదారిని తలపిస్తోంది. అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు ఏ మాత్రం ఆదమరచినా ఆస్పత్రి పాలైయ్యే ప్రమాదం ఉంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎర్రమట్టి కొట్టుకువచ్చి రహదారిపై నిలిచిపోయింది. దీంతో మట్టి రోడ్డును తలపిస్తుంది. పర్యావసంగా అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు, పాదచారులు రహదారి పక్క నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిది. రహదారిపై బురద పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనాలు తరచూ ఆ ప్రదేశంలో ప్రమాదాలకు గురవుతున్నట్టు ఆ ప్రాంతీయులు చెబుతున్నారు. ఇరువైపులా డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో వర్షపు నీరు రహదారిపై నుంచి ప్రవహిస్తుందని వాపోతున్నారు. దీంతోపాటు చిన్నపాటి వర్షంపడినా ఆ ప్రదేశం బురదమయంగా తయారవుతోంది. అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై వర్షపు నీరు ప్రవహించే ప్రదేశాలను గుర్తించి డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జీసీసీ తూకాల్లో మోసాలకు తావుండదు

- కాశీపట్నం బ్రాంచీ మేనేజర్ మురళీకృష్ణ



సీసాగుడలో అవగాహన కల్పిస్తున్న జీసీసీ మేనేజర్ మురళీకృష్ణ

అనంతగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జీసీసీ ద్వారా గిట్టుబాటుధరతో పాటుగా తూ కాల్లో మోసాలకు తావుండదని జీసీసీ కాశీపట్నం బ్రాంచీ మేనేజర్ మురళీకృష్ణ రైతులకు కల్పించారు. మండలంలోని టోకూరు పంచాయతీ దొరగుడ, నిసానిగుడ, బల్యగుడ, సీసాగుడ గ్రామాల్లో కాఫీ రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. రైతులు ఇళ్ల వద్ద కాఫీ కొనుగోలు చేస్తామని, రైతులు దళారులను నమ్మిపోవద్దని సూచించారు. జీసీసీ ద్వారా పార్చ్‌మెంట్ కేజీ రూ.285, చెర్రీ కేజీ రూ. 150, రోబస్టా కేజీ రూ.80, కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మండలానికి వంద మెట్రిక్ టన్నులను టార్గెట్ పెట్టుకుని, ఇందుకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలోని జూనియర్ అసిస్టెంట్ డి. అప్పన్నదొర, పి.బలరాం, బి. ముత్యాలు, కె. అప్పలస్వామి, కె.అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

పాడేరురూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సబ్ ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యనారాయణ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల్లో ఎన్ఎస్ఎస్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం, స్వచ్ఛ సంకల్పంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, అధ్యాపకులు పి.కోటేశ్వరరావు, డి.గణేష్, జి.దామోదరం, గౌరీశంకరరావుపాల్గొన్నారు.

25వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు

పాడేరురూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీవోఎస్ఎస్)ద్వారా 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్ తరగతుల్లో అడ్మిషన్‌లు పొందేందుకు ఈ నెల 25వ తేదీవరకు గడువు పొడిగించినట్టు డీఈవో పి.బ్రహ్మాజీరావు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆర్.శివికుమార్ తెలిపారు. రూ. 200 అపరాధరుసుంతో 29వ తేదీ వరకు రూ. 500 అపరాధ రుసుంతో 31వ తేదీ వరకుఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ ఓపెన్ స్కూల్. ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

పెసా చట్టానికి లోబడి మద్యం షాపులు కేటాయించాలి

- గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్న



ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

పాడేరురూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతంలో పెసా చట్టం, గ్రామ సభలకు లోబడి మద్యం దురాణాలను నిర్వహించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. ధర్మన్నపడాల్, పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. మన్యంలో మద్య దుకాణాల లాటరీ, వాటి నిర్వాహణ లోపాలపై ఎక్సైజ్ సూపరిండెంట్‌కు ఫిర్యాదు చేసేందుకు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉన్న కార్యాలయానికి వచ్చారు. దీనికి తాళాలు వేసి ఉన్నాయి. దీంతో కార్యాయలం ఎదుట ఆందోళన చేశారు. మద్యం దుకాణాలు అనుమతులు. రద్దు చేయడం అంతిమ అధికారాలు పెసా గ్రామ సభలకు మాత్రమే ఉంటుందన్న విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో లాటరీ పద్ధతి ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అరకువేలిలో ఆదివాసీ నిరుద్యోగులకు కేటాయించిన ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్‌లో బినామీలు మద్యం షాపులు నిర్వహిస్తున్నారన్నారు. ఐటీడీఏ అధికారులు తక్షణం స్పందించి వాటిని తొలగించాలన్నారు.

ఎలుగుదాడిలో గాయపడిన బాధితులకు పరామర్శ



కేజీహెచ్‌లో బాధితురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

డుంబ్రిగుడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుంటగన్నెల పంచాయతీ పిత్తగుడ గ్రామం లో ఎలుగుబంటి దాడిలో గాయాలై విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్సలను పొందుతున్న బాధిత గిరిజనులు కిల్లో లక్ష్మి, కిల్లో కేశవరావులను ఎమ్మెల్యే మత్స్యలింగం శుక్రవారం పరామర్శించారు. కేజీహెచ్ సూపరిడెంట్ శివానంద, వైద్య నిపుణులతో ఆయన మాట్లాడి మెరుగైన చికిత్సందించాలని కోరారు. బాధితులకు నష్ట పరిహారం అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.ట్రైబల్‌సెల్ వైద్య నిపుణులు సంపత్, రవీంద్ర ఆయన వెంట ఉన్నారు.

మ్యూజియం షాపింగ్ కాంప్లెక్స్‌లో వైన్‌షాపు తొలగించండి: పీవో

అరకులోయ, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): అరకులోయ లో మ్యూజియం షాపింగ్‌కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన వైన్‌షాపును తక్షణం తొలగించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఎక్సైజ్ అధికారులకు శుక్రవారం శు క్రవారం ఆదేశించారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో బినామీలు వైన్ షాపులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే విషయంపై అరకులోయ ఎక్సైజ్ సీఐ దృష్టికి తీసుకువెళ్లగా మ్యూజియం షాపు నుంచి వైన్‌షాపును తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు.

చెత్తసంపద కేంద్రాలతో ఆదాయం

అనంతగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శుక్రవారం కాశీపట్నం వద్ద ఉన్న చెత్తసంపద కేంద్రాన్ని ఎంపీడీవో ఎవీవీ కుమార్ పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తసంపద తయా రీ ద్వారా పంచాయతీల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. అందుకే వీటిపై దృష్టిపెడుతున్నామన్నారు.

జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు: జేసీ



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ్

పాడేరురూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారి పనులు జరుగుతున్నందున జిల్లాలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు కు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని జేసీ డాక్టర్. ఎంజే.అభిషేక్ గౌడ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో రహదారి భద్రతపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం పర్యాటక సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఘాట్ రోడ్లలో రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని, ఘాట్ రోడ్డులో పరిమితికిమించి లోడు ఉన్న వాహనాలను రాకుండాచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సలుగు, కొరవంగి రూట్‌ల్లో బస్సు సర్వీసుల ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్, మోటార వాహన అధికారి రాజేష్, పీటీడీ డిపో మేనేజర్ఉమామహేశ్వర రెడ్డి, డీఎంహెచ్‌వో షేక్.జమీల్ భాషా, డీసీహెచ్ఎస్.డాక్టర్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కావాలి

ఉపాధ్యాయులు నియోజకవర్గ ఓటర్ల జాబితాలో నవంబరు 6వ తేదీలోగా నమోదు కావాలని జేసీ అభిషేక్ గౌడ్ సూచించారు. శుక్రవారం మండల విద్యాశాఖాధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డీఆర్‌వో బి.పద్మావతి, డీఈవో పి.బ్రహ్మాజీరావు, ఎంఈవోలు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండవంచులకు ఆర్టీసీ బస్సు

- పదేళ్ల తర్వాత పునరుద్ధరణ
- కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొమ్మంగి రహదారి పనులు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆదివాసీలు



గ్రామానికి చేరుకున్న ఆర్టీసీ బస్సును స్వాగతించిన గిరిజనులు

చింతపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండవంచుల ప్రాంత ఆదివాసీలకు పదేళ్ల తరువాత ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులోకి వచ్చాయి. శుక్రవారం పాడేరు ఆర్టీసీ డిపో అధికారులు కొమ్మంగి, కొండవంచుల మీదుగా ఎర్రబంద వరకు బస్సును నడిపారు. గతంలో ఈ మార్గంలో నర్సీపట్నం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు నడిచేది. రహదారి అత్యంత అధ్వానంగా ఉండడంతో బస్సు సర్వీసుని ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొమ్మంగి రహదారిని మూడు నెలల్లో పూర్తి చేసింది. ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయడంతో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పనులను పూర్తి చేశారు. రహదారి పూర్తికావడంతో ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు పాడేరు ఆర్టీసీ డిపో అధికారులు లేఖ రాశారు. ఈమేరకు ఆర్టీసీ అధికారులు ఈ రహదారిని పరిశీలించి బస్సు సర్వీసును పునఃప్రారంభించారు. ఆర్టీసీ బస్సుకు స్థానిక గిరిజనులు మామిడి తోరణాలు కట్టి ప్రారంభించారు. తమ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించడంపై ఆదివాసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు, మ్యాక్స్ చైర్మన్ కొండలరావు పాల్గొన్నారు.

'గిరిజన ప్రగతికి అండగా పల్లె పండుగ'

పాడేరురూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగ దోహదపడుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు బొర్రా నాగరాజు, జనసేన పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య అన్నారు. శు క్రవారం వంతాడపల్లి పంచాయతీ వీసమామిడి, మినుములూరు పంచాయతీ సంగోడి, మోదాపల్లి పంచాయతీ, తుంపాడ పంచాయతీల్లో సర్పంచ్‌ల సమక్షంలో పల్లెపండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీసమామిడి గ్రామంలో రూ. 3 లక్షలతో రోడ్డు, సంగోడిలో రూ. 2 లక్షలతో ఊటకుండీ పనులకు, మోదాపల్లిలో రూ. 5 లక్షలతో టెంచ్ వర్క్, తుంపాడలో రూ. 2.5 లక్షలతో భూమి చదును పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సొనాయి రత్నకుమారి, మాజీ ఎంపీపీ ఎస్వీవీ.రమణమూర్తి, వంతాడపల్లి సర్పంచ్ ఎం.రమణమ్మ, మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టమ్మ, కూటమి నాయకులు అప్పలకొండ, సురేష్, ప్రసాద్, మురళీకృష్ణ, భూపాల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంత చేయాలి

డుంబ్రిగుడ: గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ ఈశ్వరి అధికారులకు సూచించారు. మండలంలోని సోవ్వా పంచాయతీ కేంద్రంలో పల్లెపండుగ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ సొయిత, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావుతోపాటు కూటమి నాయకులు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో పురగతిని సాధించి గిరిజనుల కష్టాలను తీర్చాలని ఆమె ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎం. స్వామి, మాజీ సర్పంచ్ ఆనంద్, చినగెన్ను, యూనిట్ ఇన్‌చార్జి కమలాకర్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా లో 62 మంది ఎంపిక



అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలందిస్తున్న అతిథులు

అరకులోయ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఆర్ఐటీఐలో జరిగిన జాబ్‌మేళాలో 62 మంది ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ,సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 195 మంది హాజరుకాగా, 52 మందిని ఎంపిక చేసినట్టు చెప్పారు. వీరికి అరకులోయ సీఐ హిమగిరి నియామకపత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా సీఐ మా ట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యం లో ప్రముఖ కంపెనీలు ఏర్పాటుచేస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, నవత రోడ్‌ట్రాన్స్‌పోర్టు, భారత్ పే, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకు తదితర కంపెనీల ప్రతినిధులు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సంగాత, ఆర్ఐటిఐ ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



సత్యం (ఫైల్‌ఫొటో)

ముంచంగిపుట్టు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో జీయూపీ పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.సత్యం (55) గుండెపోటుతో మృతి చెందారు. మండల కేంద్రంలోని ఓ ఫ్యాన్సీ షాప్ ఎదుట శుక్రవారం ఉదయం ఆయన మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి ఎస్ఐ రవీంద్రకు సమాచారమందించారు. ఎస్ఐ ఆధ్వర్యం లో సిబ్బంది మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గురువారం రాత్రి వనుగుమ్మ వెళ్లేందుకు ఉపాధ్యాయుడు సత్యం బస్టాప్‌లో నిరీక్షిస్తూ ఉన్నట్టు స్థానికులు తెలిపారు. అయితే, అర్ధరాత్రి సమయంలో గుండెపోటు వచ్చి మృతి చెంది ఉండవచ్చునని సీహెచ్‌సీ వైద్యాధికారి గీతాంజలి చెబుతున్నారు. సత్యంది స్వగ్రామం అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం కండివరం. ఆయన కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు. ఉపాధ్యాయుడి మృతికి ఎంఈవో కృష్ణమూర్తి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. 1999 డీఎస్సీ ద్వారా సత్యం ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు.

రోడ్ల నిర్మాణానికి సహకరించండి



డీఎఫ్‌వోకి పుష్పగుచ్ఛమిస్తున్న ఎంపీపీ అనుషదేవి, జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శివారు గిరిజన గ్రామాల రహదారుల నిర్మాణాలకు పెండింగ్‌లోనున్న అటవీ అనుమతులను మంజూరుకు కృషి చేయాలని డివిజనల్ ఫారెస్టు అధికారి వై. వెంకట నరసింహరావును స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎఫ్‌వోని ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ ఏజెన్సీలో అధిక శాతం గిరిజన గ్రామాలు రిజర్వ్‌డ్ ఫారెస్టు పరిధిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి ఆచూకీ కోసం గాలింపు



నది వద్ద ఆచూకీ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 18: (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారెలపంచాయతీ పెద్దపేట గ్రామ సమీపాన మత్స్యగెడ్డలో గురువారం గల్లంతైన గిరిజన యువకుడి ఆచూకీ లభించలేదు. ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వెతికినా ఫలితం కానరాలేదు. పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ రోగులపేటకు చెందిన కొర్రా వేణుగోపాలస్వామి అనే గిరిజన యువకుడు వ్యవసాయ పనిముట్లు సానపెట్టేందుకు పెద్దపేటకు నాటుపడవపై మత్స్యగెడ్డ దాటుతుండా మధ్యలో మునిగి ఆ యువకుడు గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో వి. అభిషేక్ చొరవతో విశాఖకు చెందిన ఎస్‌డీఆర్ ఎఫ్ ఎస్ఐ వైకుంఠం ఆధ్వర్యంలో 15 మంది గజ ఈతగాళ్లు ఇక్కడికి చేరుకుని రెస్క్యూ బోట్ల సహాయంతో గెడ్డ లో గాలింపు చేపట్టారు. సాయంత్రం చీకటి పడటంతో గాలింపు నిలిపి వేశారు. శనివారం మళ్లీ వెతుకుతామని ఎస్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ తెలిపారు. గాలింపు చర్యలను జి.మాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు,తహసీల్దార్లు నర్సమ్మ, రంగారావు, ఎస్ఐలు రవీంద్ర, రమణ, సర్పంచులు వి. పాండురంగస్వామి, మాధవరావు పర్యవేక్షిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో పరిశుభ్రత



గుంటవాడ జలయం వద్ద శుభ్రపరుస్తున్న పోలీసులు

పాడేరురూరల్, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలోని 244 గ్రామ పంచాయతీలలో ప్రతీ శుక్రవారం శ్రమ దాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పాడే రు డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్.కుమార్ తెలిపారు. పాడేరులోని పీటీడీ కాంప్లెక్స్ నుంచి పీఎంఆర్సీ వరకు ప్రధాన రహదారుల్లో శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, డీపీవో బి.లవరాజు, ఈవో పీఆర్డీ ఆర్‌వీఎస్.రమేష్, జీపు యూనియన్ ప్రతినిధులు, ప్రజలుపాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్‌జీ 42 బెటాలియన్ పోలీసుల స్వచ్ఛభారత్

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో శుక్రవారం సీఆర్‌పీఎఫ్‌జీ 42 బెటాలియన్ పోలీసులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ వికాష్ పాండియన్ ఆధ్వర్యంలో స్థానిక గుంటవాడ జలాశయం పరిసరాలను శుభ్రం చేశారు.

అనంతగిరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీపీ శెట్టి నీలవేణి పిలుపునిచ్చారు. చిలకలగెడ్డలో ఫ్రైడే డ్రై డే శుక్రవారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు టి. మితుల, ఎంపీడీవో ఎవీవీ. కుమార్, ఈవోపీఆర్డీ లాలం సీతయ్య పాల్గొన్నారు.

చింతపల్లి: ఎంపీడీవో పి. ఆశాజ్యోతి పర్యవేక్షణలో స్థానిక పాత బస్టాండ్ నుంచి సంతబయలు వరకు చెత్తను తొలగించారు. ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ జయలక్ష్మి, ఉప సర్పంచ్ నూరు, ఏవో రవీంద్రనాథ్, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, ఎంఈవో ప్రసాద్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

జిల్లా స్థాయి బాలల పోటీల పోస్టర్ ఆవిష్కరణ

నర్సీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాలల ప్రతిభా పాటవ పోటీల పోస్టర్‌ను స్పీకర్ అయ్యన్న పాత్రుడు శుక్రవారం ఆవిష్కరించారు. బాలల దినోత్సవంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాసరచన, విచిత్ర వేషధారణ, క్విజ్, దేశ భక్తి గీతాలు, పద్య పఠనం, కాగితం, మట్టితో కళాకృతులు తదితర అంశాలపై పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ నెల 28 నుంచి నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు ప్రారంభిస్తామని డీజీనాథ్ తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ ఫారాలను 26వ తేదీ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అడిగర్ల వరహాల నాయుడు, అల్లు అప్పారావు, ఎంఎస్ ప్రసాద్, జీవీ రమేశ్, కురచ రమణ, బాబీ, బుడిగి అప్పారావు, కుంచే మురళి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా



ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నర్సీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పెదబొడ్డేపల్లిలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం ఈఈ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేత అడిగర్ల రాజు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. వాణిజ్య సముదాలు, ప్రభుత్వ కార్యాలయాకు స్మార్ట్ మీటర్లు బిగించి, రెండో విడతలో ఇళ్లకు కూడా అమర్చడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలపై విమర్శలు చేసిన కూటమి పార్టీలు, గెలిచిన తర్వాత మరచిపోవడం భావ్యం కాదన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.

జాబ్‌మేళాలో 56 మంది ఎంపిక


ఏబీఎం కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్న దృశ్యం

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఏబీఎం డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 56 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మాండలైజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్, కాల్గేట్ పామోలివ్, అపోలో టైర్స్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రైవేటు లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ హెచ్‌ఆర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 130 మంది హాజరుకాగా, వారిలో 56 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరిని ఏబీఎం విద్యా సంస్థల కరస్పాండెంట్ అంకంరెడ్డి గిరిబాబు, ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ అభినందించారు.

రీ సర్వే ఫిర్యాదులపై విచారణ


దారపాలెంలో విచారణ చేపడుతున్న రెవెన్యూ సిబ్బంది


గొలుగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరకంపేట రెవెన్యూ గ్రామంలో భూముల రీ సర్వేలో తప్పులు దొర్లడంపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొని సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. అలాగే ఈ నెల 17వ తేదీన దారపాలెం రెవెన్యూలో వెలగల వరలక్ష్మి, మాకిరెడ్డి సన్యాసియ్య భూముల కోసం చేసిన రీ సర్వేలో తప్పులు దొర్లాయని గ్రామసభలో ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది అక్కడికి వెళ్లిభూములను పరిశీలించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డీటీ చైన్లు, వీఆర్‌వో రామకృష్ణ, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సభలతో భూ సమస్యల పరిష్కారం


గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామ సభలతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఎం.లక్ష్మి అన్నారు. శుక్రవారం చినమదీనాల్లో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ రీ సర్వేలో జరిగిన తప్పులను రెవెన్యూ సభల ద్వారా సరిచేస్తామన్నారు. 30 మంది రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు చేసుకున్నట్టు చెప్పారు. ఈ సభలో సర్పంచ్ పచ్చికూర మంగవేణి, ఎంఆర్ఐ శ్రవణ్, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

రావికమతం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ స్పష్టం చేశారు. కొత్తకోటలో పలు ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లతో ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావొద్దని సూచించారు. ప్రమాదాల వల్ల ప్రాణాలు పోతే ఆ వ్యక్తిపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యులు వీధిన పడతారని చెప్పారు. అలాగే డ్రైవర్లు మహిళా ప్రయాణికులపై మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు పక్కాగా కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

రోడ్డంతా గతుకులు.. మొరాయిస్తున్న బస్సులు

» బీఎన్ రహదారి గొయ్యిలో పేలిన ఆర్టీసీ బస్ టైర్లు

» ఉలిక్కిపడ్డ ప్రయాణికులు.. గమ్యానికి చేరడానికి తిప్పలు

రావికమతం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):

బీఎన్ రోడ్డు ప్రయాణికులకు నరకం చూపుతోంది. రహదారి ఆద్యంతం గతుకుల మయం కావడంతో ఆర్టీసీ బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. ఈ మార్గంలో ఇటీవల ఓ బస్సు చక్రాలు ఊడిపడగా, శుక్రవారం ఉదయం 11 గంటలకు చోడవరం నుంచి ప్రయాణికులతో నర్సీపట్నం వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రాల టైర్లు పేలిపోవడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు.

రావికమతం హీరో హోండా షోరూమ్ వద్ద భారీ గొయ్యిలో పడి చోడవరం-నర్సీపట్నం ఆర్టీసీ బస్సు రెండు చక్రాలు పేలిపోయాయి. ఒక్కసారిగా గొయ్యిలో దిగిన బస్సు రెండు చక్రాలు పేలి పెద్ద శబ్దం రావడంతో ప్రయాణికులు కంగారుపడ్డారు. కండక్టర్ పరిశీలించి బస్సు వెనక టైర్లు పేలడంతో శబ్దం వచ్చిందని తెలపడంతో ప్రమాదం నుంచి బయట పడ్డామని అంతా ఊపిరి పీల్చుకున్నారు.



బీఎన్ రోడ్డు రావికమతం హోండా షోరూమ్ వద్ద మొరాయించిన బస్సు

బీఎన్ రోడ్డులో రోలుగుంట మండలం వెలంకాయల పాలెం నుంచి చోడవరం మండలం గంధవరం వరకూ ఉన్న సుమారు 45 కిలోమీటర్ల రహదారి పొడవునా చెరువును తలపించే విధంగా భారీ గోతులు ఏర్పడ్డాయి. దీని మరమ్మతుల కోసం గత ప్రభుత్వం హయాంలో ఎన్డీబీసీ నిధులు రూ.78.90 కోట్లు మంజూరు చేసిన సంగతి తెల్సిందే. అయితే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయనందున నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో భారీ వర్షాలకు ఈ రోడ్డు పొడవునా ఏర్పడిన పెద్ద పెద్ద గొయ్యిల్లో వర్షపు నీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ గోతుల్లో బరువు వాహనాలు దిగిపోడం, బస్సులు రోజూ నర్సీపట్నం నుంచి చోడవరం చేరే లోపే ఏదో చోట మొరాయించడంతో ప్రయాణికులకు ముప్పతిప్పలు పడుతున్నారు. కనీసం ఈ గోతులైనా పూడ్చి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చేయాలని కాంట్రాక్టర్‌ను, ఆర్‌అండ్‌బీ అధికారులను ప్రజలు కోరుతున్నా ఫలితం లేకపోతోంది. దీంతో తరచూ బస్సులు, ఇతర వాహనాలు మొరాయిస్తుండడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ముందే నర్సీపట్నం డిపోలో డొక్కు బసులు కావడంతో ఏదో చోట తరచూ మొరాయించి ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీఎన్ రోడ్డు మర్మతుతు చేయాలని కోరుతున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే రాజు జన్మదిన వేడుకలు

చోడవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరావతిలో సీఎం చంద్రబాబుతో సమావేశానికి ఎమ్మెల్యే రాజు శుక్రవారం హాజరుకావడంతో, పార్టీ శ్రేణులు స్థానికంగా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా గురువారం రాత్రి కొందరు నాయకులు ఎమ్మెల్యే రాజుకు ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చోడవరంలోని ప్రధాన సెంటర్లలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే రాజు కటౌట్‌లు ప్రత్యేతక ఆకర్షణగా నిలిచాయి.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది, కోమళ్లపూడి, బుచ్చెయ్యపేట, దిబ్బిడి, మల్లాం, రాజాం, నీలకంఠాపురం, పొలేపల్లి, గున్నెంపూడి, పెదమదీన, పెదపూడి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పుట్టిన రోజు వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వడ్డాది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పార్టీ వడ్డాది అధ్యక్షుడు దొండా నరేష్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దొండా గిరిబాబు, సింగంపల్లి రమేష్, వియ్యపు అప్పారావు, సాయం శేషు, దొండా శ్రీను, గొన్నాబత్తుల శ్రీనివాసరావు, సయ్యపురెడ్డి మాధవరావు, సూరాతి పేరమ్మ పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: అమరాతిలో ఉన్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు టీడీపీ మండల నాయకులు నేరుగా వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం వేకువజామునే సీనియర్ నేత కోట గోవిందరావు, కన్నంపేట ఎంపీటీసీ మాజీ సభ్యుడు బంటు శ్రీను, మర్రివలస సర్పంచ్ జోగిపాత్రుడు, దొండపూడికి చెందిన వెంకటాచారి, కొత్తకోటకు చెందిన వెల్లంకి ఈశ్వరరావు తదితరులు విజయవాడ వెళ్లారు. ముందుగా కనక దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే రాజు పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రాజుకు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.





అమరావతిలో ఎమ్మెల్యే రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రావికమతం నాయకులు..... రోలుగుంట: కొవ్వూరులో వేడుకలను నిర్వహిస్తున్న బంటు రాజు

రోలుగుంటలో...

రోలుగుంట: మండలంలో ఎమ్మెల్యే రాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కె.నాయుడుపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, కొవ్వూరులో ఐటీడీపీ మండల ఇన్‌చార్జి బంటు రాజు, జేపీ అగ్రహారంలో మాజీ సర్పంచ్ రొంగలి రమణ, శరభవరంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, నిండుగొండలో సుర్ల బాబులునాయుడు, కొండపాలెంలో ఉప సర్పంచ్ బంటు చిరంజీవి, రోలుగుంటలో ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ, రత్నంపేటలో పిట్ల బుల్లిబాబు, బుచ్చెంపేటలో కర్రి వెంకటరమణ, ఉలబాల పోతురాజునాయుడు, కంచుగుమ్మలలో పరవాడ నారాయణదొర, జె.నాయుడుపాలెంలో బోడాపాత్రుని నరేష్, కిల్లాడ నాయుడు, కుసర్లపూడిలో సబ్బవరపు పెద్దినాయుడు, గండి తాతాజీ, కొంతలంలో గూడెపు నానాజీ, అడ్డసరంలో విశారపు రమణాజీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే రాజు మరెన్నో పుట్టిన రోజు వేడుకలను జరుపుకోవాలని ఆకాక్షించారు.

పిత్రిగెడ్డలో డోలీ మోతపై ఆర్డీవో విచారణ

రోలుగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిత్రిగెడ్డలో శుక్రవారం ఆర్డీవో వీవీ రమణ పర్యటించారు. 'ఆదివాసీలకు తప్పని డోలిమోతలు' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తపై ఆర్డీవో, రెవెన్యూ అధికారులు స్పందించారు. పిత్రిగెడ్డ నుంచి అర్ల వరకు ఆరు కిలోమీటర్లు డోలిపై కాలినడకన తరలించిన ఘటనపై ఆరా తీశారు. కొర్రా దేవి అనే గిరిజన మహిళ ప్రసవం తర్వాత బిడ్డ ఆరోగ్యం బాగో లేకపోవడంతో కుటుంబ సభ్యులు డోలిపై తల్లీబిడ్డలను ఆరు కిలోమీటర్లు దూరంలో ఉన్న అర్లకు వెళ్లి, అక్కడ నుంచి ఆటోలో బుచ్చెంపేట ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పత్రికల్లో వార్తలు రావడంతో ఆర్డీవో రమణ, ఇన్‌చార్జి తహసీల్దార్ శంకరరావు, ఆర్ఐ రామమూర్తి ఆ గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. స్థానిక గిరిజనులతో మాట్లాడారు. ఏఎన్ఎం ఆదేశాల మేరకే కొర్రా రాజు, రమేష్ అనే వ్యక్తులు బాలింత దేవిని ఆసుపత్రికి తరలించారని, రోడ్డు మార్గం సక్రమంగా లేకపోవడంతోనే డోలీలో తరలించాల్సి వచ్చిందని గ్రామస్థులు తెలిపారు. అర్ల నుంచి పిత్రిగెడ్డ వరకు రోడ్డు మార్గాన్ని అధికారులు పరిశీలించారు. మంజూరైన నిధులపై ఆరా తీశారు. పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్డీవో రమణ తెలిపారు.


పిత్రిగెడ్డలో విచారణ చేపడుతున్న ఆర్డీఓ వీవీ రమణ, రెవెన్యూ అధికారులు

గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారించాలి

కె.కోటపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిపాలనపై పాలకులు దృష్టిసారిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో సాంబశివరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం 16 పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర ఎంతో కీలకమన్నారు. వార్డు సభ్యులు పంచాయతీ తీర్మానాల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలరాజు, ఈవోపీఆర్డీ రమణి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాంబశివరావు

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకొని రీ సర్వేలో జరిగిన తప్పులు సరిదిద్దుకోవాలని తహసీల్దార్ లోకవరపు రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని గబ్బాడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 81 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు జరుగుతున్న గ్రామాలలో రైతులు ముందుకు వచ్చి రీ సర్వే సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు పరిశీలించి 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈర్లి రాజేశ్వరి, మండల సర్వేయర్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

లైసెన్సులు లేని వాహనదారులపై చర్యలు

మాడుగుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని మాడుగుల ఎస్ఐ ఎస్.నారాయణరావు హెచ్చరించారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల 18 ఏళ్లు నిండని వారు ఎక్కువగా వాహనాలు నడుపుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, వారు అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారని చాలా మంది ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. 18 ఏళ్లు నిండని వారికి వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే వాహన చోదకులు అన్ని రికార్డులు, ఇన్సూరెన్స్‌లు కలిగి ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎలాంటి ఒత్తిళ్లకు తావు లేకుండా రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని ఎస్ఐ కోరారు.

నాడు-నేడు భవనాల పురోగతిపై పరిశీలన

» రాష్ట్ర మౌలిక సదుపాయాల సమన్వకర్తయ నాగేశ్వరరావు

దేవరాపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాడు-నేడు కింద నిర్మించ భవనాల పురోగతిని పరిశీలిస్తున్నామని రాష్ట్ర మౌలిక సదుపాయాల సమన్వయకర్త కె.నాగేశ్వరరావు చెప్పారు. మండలంలోని బేతపూడి కస్తూర్బాగాంధీ విద్యాలయం, ఎ.కొత్తపల్లి, కాశీపురం, దేవరాపల్లి జూనియర్ కళాశాలల్లో నిర్మించిన భవనాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భవనాలు ఏ దశలో ఉన్నాయి, బిల్లులు ఎంత వరకు చెల్లించారు, ఇంకా ఎంత పెండింగ్‌లో ఉన్నాయన్న అంశాలను పరిశీలించి నివేదిక తయారు చేస్తున్నామని చెప్పారు. ఆరు నెలల్లో బిల్లు బకాయలు చెల్లించడంతో పాటు అసంపూర్తిగా ఉన్న భవనానలు పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదన్నారు. అనకాపల్లి జిల్లాలో సుమారు 197 పాఠశాలల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని, తల్లిదండ్రుల పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తామని చెప్పారు. ఆయన వెంట శ్రీను, సంతోష్ కుమార్ ఉన్నారు.


బేతపూడి కేజీబీవీ భవనాన్ని పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

రావికమతం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం గ్రామానికి చెందిన కేశంశెట్టి భగవాన్ శుక్రవారం తల్లిదండ్రుల చెంతకు చేరాడని ఎస్ఐ రఘువర్మ తెలిపారు. పదో తరగతి చదువుతున్న భగవాన్ కనించలేదని తండ్రి సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందేనన్నారు. చదవడం ఇష్టం లేని భగవాన్ గర్నికం గ్రామ శివారులో ఎవరి కంట పడకుండా తిరుగుతూ తానే ఇంటికి చేరాడని చెప్పారు. భగవాన్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్టు తెలిపారు.


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మండల కోఆర్డినేటర్ కామేశ్వరరావు

వార్డు సభ్యుల సహకారంతోనే అభివృద్ధి

చీడికాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లోని వార్డు సభ్యుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని మండల ట్రైనీ కోఆర్డినేటర్ కామేశ్వరరావు చెప్పారు. మండలంలోని 23 పంచాయతీల్లో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఆశించినంతగా అభివృద్ధి చెందాలంటే సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు కూడా అంకితభావంతో పనిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు పట్ల కనీసం అవగాహన ఉండాలని, పంచాయతీలో ఏ విధమైన పనులు చేయాలనే ముందుగా తెలుసుకోవాలని చెప్పారు. ఈ శిబిరంలో మరో కోఆర్డినేటర్ సత్తిబాబు, మండల పరిషత్ పర్యవేక్షకులు ఎల్.కామేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములపూడి జిల్లా పరిత్ ఉన్నత పాఠశాలలో రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీ చూడడం తగ్గించి చదువు మీద ఏకాగ్రత పెంచుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు.

అంతర పంటల సాగు లాభదాయకం

మాడుగుల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ తోటల్లో అంతర పంటగా కోకో మొక్కలు సాగు చేయడం లాభదాయకమని మండల ఉద్యానవన శాఖాధికారిణి భాను పుష్పలీలావతి చెప్పారు. శుక్రవారం తాటిపర్తి, శంకరం గ్రామ రైతులకు మొబైల్ వ్యాన్ ప్రసారాలు ద్వారా కోకో పంటలపై అవగాహన కల్పించారు. సాధారణ పంటగా కోకో సాగు చేయడం కంటే పామాయిల్ తోటల్లో అంతరపంటగా సాగు చేయడం మంచిదన్నారు. కోకో సాగు విధానం, యాజమాన్య పద్ధతులను ఆమె వివరించారు. సూపర్‌వైజర్ సిద్దార్థ్, వీహెచ్ఏలు అలేఖ్య, దేవి పాల్గొన్నారు.

23న రైతుల సర్వసభ్య సమావేశం

మాడుగుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని రంగాల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 23న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెన్నేటి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ చైర్మన్ పిల్లా అప్పలనాయుడు, సీఈవో సౌమ్య తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరవుతారని చెప్పారు.

స్పీకర్ అయ్యన్న పర్యటన రేపు

నాతవరం, అక్టోబరు 18: మండలంలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదివారం పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

మాకవరపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్దేశిత ధరలకే మద్యం విక్రయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మర్రినాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సభ్యుడు అడిగర్ల రాంబాబు కోరారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దకాణాలను సిండికేట్‌లకు అప్పజెప్పి ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు జరుపుతున్నారని వారు చెప్పారు. అలాగే బూరుగుపాలెంలో హైస్కూల్‌కు 40 మీటర్ల దగ్గరలో మద్యం దుకాణం ఉందన్నారు. నింబంధనల ప్రకారం మద్యం దుకాణాలు నిర్వహించకపోతే ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బాబూరావు, కుల్లయ్య రమేష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన

చోడవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో 18 ఏళ్లు దాటిన వారంతా ఆన్‌లైన్ యాప్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమానికి బీఎస్సీ విద్యార్థి గాయత్రిని కాలేజీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో మాల్యాద్రి, అధ్యాపకులు అప్పలనాయుడు, రఫియుద్దీన్, సుధీర్, సత్యవతి పాల్గొన్నారు.

రాజువీధిలో సీసీ రోడ్డు నిర్మాణం

మాడుగుల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాడుగుల రాజువీధిలోని 13 వార్డులో రూ.3 లక్షల పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. వార్డు సభ్యుడు నాగోజీ కనకదుర్గ ఆధ్వర్యంలో ఈ పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు కుక్కర మహేశ్వరి, నాయకులు జవ్వాది వరహాలు, వాసు, శ్రీధర్, రాజీ శ్రీను, పైడిబాబు పాల్గొన్నారు.

యూట్యూబ్ కుర్రోళ్లు


ప్రకృతిలో పానీపూరి తయారు చేస్తున్న వీడియోను తీస్తున్న అరకు ట్రైబల్ కల్చర్ యూట్యూబ్ ఛానెల్ యువకులు

గిరిజన ఆచార సంప్రదాయాలు, పెళ్లిళ్లు, పండగలు, వంటకాలపై 'అరకు ట్రైబల్ కల్చర్' పేరుతో ప్రత్యేక వీడియోలు

- ఇప్పటి వరకు 399 వీడియోలు అప్‌లోడ్, 5.28 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు
- వచ్చిన ఆదాయంతో సేవా కార్యక్రమాలు
- హేళన చేసిన వారి నుంచే ప్రశంసలు పొందిన అనంతగిరి యువకులు

ఓ స్నేహితుడి సలహా ఆ యువకుడి జీవితాన్నే మార్చేసింది. టీవీ ఛానెళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చే స్థాయికి తీసుకువెళ్లింది. అతనితో పాటు ఉన్నవారికి కూడా గుర్తింపు తెచ్చి పెట్టింది. గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్టు చూపిస్తూ 5.28 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకున్న 'అరకు ట్రైబల్ కల్చర్ యూట్యూబర్స్‌'పై ప్రత్యేక కథనం... ● అనంతగిరి, ఆంధ్రజ్యోతి

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయతీ దండబాబు గ్రామానికి చెందిన రాము బీఈడీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉండేవాడు. ఆ సమయంలో అతని స్నేహితుడు భీమన్న ఓ సలహా ఇచ్చాడు. ఒడిశాలో ఓ యువకుడు యూట్యూబ్ ఛానెల్ పెట్టి అక్కడి సంస్కృతి, గొప్పతనాన్ని చక్కగా చూపిస్తున్నాడని, అలా నువ్వెందుకు చేయకూడదని రామును ప్రశ్నించాడు. ఆ ఆలోచన రాముకు నచ్చి 2021 నవంబరు 8వ తేదీన 'అరకు ట్రైబల్ కల్చర్' పేరుతో యూట్యూబ్ ఛానెల్ పెట్టాడు. అనంతగిరి పంచాయతీ రాజుపాక గ్రామానికి చెందిన రాజు, గణేశ్, చిన్నారావు, లక్ష్మణ్‌లతో బృందంగా ఏర్పడి వీడియోలు తీయడం ప్రారంభించాడు.


నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న రాము

హేళన చేసిన వారే మెచ్చుకుంటున్నారు

యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించిన కొత్తలో వీడియోలు తీస్తుంటే గ్రామస్థులు ఆ యువకులను హేళన చేసేవారు. బుద్ధిగా చదువుకోక మీకెందుకురా వీడియోలు అంటూ ప్రశ్నించేవాళ్లు. వారిని చూసి మిగతా వాళ్లు పాడైపోవద్దని చులకనగా మాట్లాడేవారు. అయితే...ఏడాదిలో గ్రామస్థుల్లో పరివర్తన వచ్చింది. ఆ యువకులను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

గిరిజనుల జీవన విధానాన్ని ప్రతిబింబిస్తూ..
మైదాన ప్రాంత ప్రజలతో పోలిస్తే గిరిజన ప్రాంతంలోని వారి జీవన విధానం వినూత్నంగా ఉంటుంది. ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు, పండగలు, పెళ్లిళ్లు, ఆచార సంప్రదాయాలు విభిన్నంగా ఉంటాయి. గిరిజన ప్రాంతంలో బొండ, కోందు, పీవీటీజీ, నూకదొర, కొండదొర, భగత, తదితర గిరిజన జాతుల రోజువారీ జీవన విధానం గురించి చాలామందికి ఇప్పటికీ తెలియదు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఈ ప్రాంత గొప్పతనాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేయాలని ఈ బృందం నిర్ణయించుకుంది. ముందుగా బొడ్డెంగి పురుగులతో వంట చేసే విధానాన్ని వీడియో తీసి యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేయడంతో వీరి ప్రయాణం మొదలైంది. తరువాత దట్టమైన అటవీ ప్రాంతంలో ఈత దుంపల సేకరణ, వండుకునే విధానం, పూర్వీకులు ఆముదం పిక్కలు, కానుగ పిక్కలను సేకరించి నూనెను ఎలా తయారుచేసుకునేవారు అనే దానిపై వీడియోలు చిత్రీకరించారు. గిరిజనుల పెళ్లిళ్లు, పండుగలు, వారపు సంతల్లో అటవీ ఉత్పత్తుల విక్రయాలు, అటవీ ప్రాంతంలో దొరికే పండ్లు తదితర వాటిపై వీడియోలు చేశారు. పర్యాటక ప్రాంతాల పరిచయం చేయడం, అరకులోయ సమీపాన మాడగడ వ్యూపాయింట్, అనంతగిరి చిట్టంపాడు జలపాతం, చింతపల్లి, లంబసింగి ప్రత్యేకతలను వీడియోలు తీసి పర్యాటకుల మదిలో స్థానం సంపాదించుకున్నారు. మొదట్లో వంద మందితో మొదలై ఇప్పుడు 5.28 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకున్నారు.

స్నేహితుడి సలహాతో..

నా స్నేహితుడు భీమన్న సలహాతోనే ఈ యూట్యూబ్ ఛానెల్ పెట్టాను. గిరిజన ప్రాంతం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పే విధంగా గిరిజన ఆచార సంప్రదాయాలపై వీడియోలు చేస్తున్నాం. యూట్యూబ్‌కు మంచి పేరు వచ్చింది..ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.



- రాము, యూట్యూబర్

ఆదాయంతో సేవా కార్యక్రమాలు

అరకు ట్రైబల్ కల్చర్ యూట్యూబ్ ఛానెల్ విశేష ఆదరణ పొంది ఆ యువకులకు ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. యూట్యూబ్ ఛానెల్‌కు పేరు వచ్చిన తరువాత మొదట అందుకున్న నగదు ప్రోత్సాహకం రూ.1.4 లక్షలు. ఆ తరువాత నుంచి ప్రతి నెలా రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తోంది. దీంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవంతో పాటు పలు పర్వదినాల్లో వృద్ధులకు రగ్గులు, గిరిజన మహిళలకు చీరలు, నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నారు.

మూడు బైక్‌లు దగ్ధం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయరామరాజుపేటలో గురువారం రాత్రి మూడు బైక్‌లపై గుర్తు తెలియని దుండగులు పెట్రోలు పోసి నిప్పు పెట్టడంతో దగ్ధమయ్యాయి. మెకానిక్‌లు త్రినాథ్, ధనాజీ షెడ్‌కి బోర్‌కు వచ్చిన పల్సర్ బైక్, ప్యాషన్ ప్లస్ బైక్, స్కూటీ వచ్చాయి. గురువారం రాత్రి మూడు బైక్‌లను షెడ్ ఎదురుగా చైన్‌తో లాక్ చేసి మెకానిక్‌లు ఇంటికి వెళ్లిపోయారు. రాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు బైక్‌లపై పెట్రోలు పోసి తగులబెట్టడంతో దగ్ధమయ్యాయి. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు మెకానిక్ ధనాజీ తెలిపారు.

పోలీసుల రక్తదానం


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ దీపికా పాటిల్

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కైలాసగిరిలో ఉన్న జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని ప్రారంభించిన అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం. దీపికా పాటిల్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న వారంతా సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన పోలీసు అధికారులను, సిబ్బంది అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకు ముందు ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. దేవప్రసాద్, ఎల్. మోహన్‌రావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, బాల సూర్యారావు, మన్మథరావు, సతీశ్, నరసింహమూర్తి సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి


దుర్గా ప్రసాద్ (ఫైల్ ఫొటో)

రావికమతం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్.బెన్నవరం పంచాయతీ శివారు కిత్తంపేటకి చెందిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ కొమానాపల్లి దుర్గాప్రసాద్ (28) విద్యుత్ షాక్‌కు గురై శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు కిత్తంపేటలో సీతిన రామారావు ఇంటికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరమ్మతుల కోసం దుర్గాప్రసాద్ దొండపూడి వద్ద ఉన్న ఏబీ స్విచ్ ఆఫ్ చేసి విద్యుత్ సరఫరాను నిలిపి వేశాడు. మరమ్మతు పనులు పూర్తి చేసి తిరిగి ఏబీ స్విచ్‌ను ఆన్ చేసే ప్రయత్నంలో విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. ఇది గమనించిన అదే గ్రామానికి చెందిన సగపరపు సాయికుమార్, అతడి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించాడు. తల్లి కాసమ్మ ఘటనా స్థలానికి చేరుకొని దుర్గాప్రసాద్‌ను కొత్తకోట పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. కాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొత్తకోట పోలీసులు తెలిపారు. దుర్గాప్రసాద్‌కు తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

అచ్యుతాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. సీఐ నమ్మి గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి పట్టణంలోని విజయరామరాజుపేటకు చెందిన ఆళ్ల రవికుమార్(35) రాంబిల్లి మండలంలోని ఎన్ఏఓబీ పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి పదిన్నర గంటల సమయంలో ఎన్ఏఓబీ చెందిన ఒక వాహనంలో అచ్యుతాపురం మండలం వెదురువాడ చేరుకున్నాడు. అక్కడ వాహనం దిగి అచ్యుతాపురం జంక్షన్‌కు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా సెజ్‌లో ఒక కర్మాగారానికి ఉద్యోగులను తీసుకువెళ్లే ప్రైవేటు బస్సు ఢీకొంది. దీంతో రవికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి పంపారు. అక్కడ చికిత్స పొందుతూ రవికుమార్ మృతచెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని సీఐ చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదం

» ఎమ్మెల్యే విజయ్‌కుమార్
» కొక్కిరాపల్లిలో ఉమ్మడి జిల్లా గురుకులాల సైన్స్ ఫెయిర్


విద్యార్థులు రూపొందించిన ప్రయోగ నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, జేసీ జాహ్నవి

ఎలమంచిలి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 18: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు సైన్స్‌ఫెయిర్‌లు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కొక్కిరాపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లాల గురుకుల పాఠశాలల సైన్స్ ఫెయిర్‌ను ఆయన జాయింట్ కలెక్టర్ జాహ్నవితో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలను తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సైన్స్ ఫెయిర్‌లు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతాయని, మరింత ప్రతిభావంతులుగా ఎదగడానికి ఉపయోగపడతాయని అన్నారు. చదువుతోపాటు చిన్నతనం నుంచే పరిశోధనలపై ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్తులో ఉన్నతంగా రాణిస్తారని అన్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందని ఆయన అభిప్రాయపడ్డారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలో 11 గురుకుల పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రయోగ నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో సుజాత, డీసీవో రూపవతి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో అప్పారావు, ఎంఈవో అరుణ్‌కుమార్, పలువురు కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

మూలజంపలో ఇసుక రీచ్

» కలెక్టర్ ఆదేశాలతో అధికారులు పరిశీలన


మూలజంప వద్ద శారదా నదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవి

రాంబిల్లి, అక్టోబరు 18 : మండలంలోని మూలజంప గ్రామం వద్ద శారదా నదిలో ఇసుక రీచ్‌ను శుక్రవారం తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవి పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ ఇసుక రీచ్‌ను పరిశీలించడానికి వచ్చామని, నదిలో నీటి ఉధృతి తగ్గిన తరువాత ఇక్కడ ఎంత ఇసుక అందుబాటులో వుందో తెలుస్తుందని అన్నారు. ప్రభుత్వ కట్టడాలు, పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలతోపాటు ప్రజలు సొంతంగా నిర్మించుకునే ఇళ్లకు అవసరమైన ఇసుకను ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తీసుకెళ్లే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని చెప్పారు.

వరహా నదిలో...

ఎస్.రాయవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జె.రమేశ్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ శుక్రవారం మండలంలోని దార్లపూడి, పెదఉప్పలం గ్రామాల పరిధిలో వరహా నది పరీవాహక ప్రాంతాలను సందర్శించారు. ఇక్కడ ఇసుక నిల్వలు ఎంత మేర వున్నాయి, నదిలో నుంచి ఇసుక తరలించడానికి మార్గం వుందా, తదితర విషయాలపై ఆరా తీశారు. దీనిపై కలెక్టర్‌కు నివేదించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ భాను, ఆర్ఐ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలో వెనుకబడిన విశాఖపట్నం రీజియన్

» ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లతో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం
» త్వరగా పూర్తి చేయాలని సూచన
» వ్యవసాయం, పర్యాటకం, వాణిజ్యం, రవాణా, తదితర అంశాలపై ఆరా


వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో కలెక్టర్లు, ఇతర అధికారులతో నీతి అయోగ్ సీఈఓ భేటీ

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రణాళిక రూపకల్పనలో విశాఖపట్నం రీజియన్ వెనుకబడి ఉందని, త్వరితంగా పూర్తిచేస్తే జనవరిలో నివేదిక విడుదల చేస్తామని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం సూచించారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఆయన ఇక్కడ రీజియన్ పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, ఉభయ గోదావరి జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు తయారుచేసిన ప్రణాళిక, దానికి జోడించిన అంశాలను ఆయన పరిశీలించారు. రీజియన్‌లో సహజ వనరుల లభ్యత, అనుకూల, ప్రతికూల అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రోత్ హబ్‌లో చేపట్టబోయే ప్రాజెక్టులు, సమగ్ర ప్రణాళికలు, అమలు, తదితర అంశాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలను కలెక్టర్లు వివరించారు. అభివృద్ధి చోదకాలైన వ్యవసాయం, పర్యాటకం, వస్తు తయారీ, వ్యాపార, వాణిజ్య రంగాలు, ఆర్థిక అంశాలు, రవాణా, పరిపాలన, తదితర విషయాలపై లోతుగా అడిగి తెలుసుకున్నారు. ముంబై, సూరత్, వారణాసి రీజియన్లలో ప్రణాళిక రూపకల్పన చివరి దశలో ఉందని, ఇక్కడ మధ్యలో ఉందని త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నీతి అయోగ్ కమిటీ సభ్యులతో పాటు కలెక్టర్లు హరేంధిర్ ప్రసాద్, విజయ కృష్ణన్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్లు సంపత్‌కుమార్, విశ్వనాథన్, పోలీస్ కమిషనర్ శంకరబ్రత బగ్చి పాల్గొన్నారు.

ఆర్డీవోతో మైనింగ్ అధికారులు సమావేశం


ఆర్డీవో వీవీ రమణతో సమావేశమైన మైనింగ్ అధికారులు

నర్సీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గబ్బాడ డిపోలోని ఇసుక సరఫరాపై జిల్లా మైనింగ్ అధికారులు నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణతో చర్చించారు. శుక్రవారం ఉదయం అనకాపల్లి మైనింగ్ ఏడీ ఎం. శ్రీనివాసరావు, నర్సీపట్నం ఏడీ జి. శివాజి, సహాయక జియాలజిస్టు వెంకటరమణ గబ్బాడ డిపోలోని ఇసుక నిల్వలు పరిశీలించారు. అక్కడ వెయింగ్ మిషన్ పనితీరుని పరీక్షించారు. తర్వాత సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోని కలిశారు. ఇసుక సరఫరా విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి ఒక నిర్ణయానికి రావాలని నిర్ణయించారు.


మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న అభిజిత్ కార్మికులు

మోకాళ్లపై నిల్చుని అభిజిత్ కార్మికులు నిరసన

అచ్యుతాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారం యాజమాన్యంపై చర్యలు తీసుకొని తమకు ఉపాధి కల్పించాలంటూ కార్మికులు శుక్రవారం కర్మాగారం ముందు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. తమతో మాట మాత్రంగానైనా చెప్పకుండా కర్మాగారాన్ని మూసివేశారని కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రొంగలి రాము, కూండ్రపు సోమునాయుడుతోపాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మద్యం వ్యాపారులు సిండికేట్

... 5వ పేజీ తరువాయి

ఈ గ్రామంలో అనధికార మద్యం అమ్మకాలకు ఓ బెల్టు వ్యాపారి రూ.5.25 లక్షలకు పాడుకున్నాడు. ఈ డబ్బులను గ్రామ దేవతల పండుగలకు వినియోగిస్తారని స్థానికులు చెబుతున్నారు.

అచ్యుతాపురం మండలంలో నాటుసారా తయారీ, అమ్మకాలు అధికంగా వుంటాయి. గత వైసీపీ ప్రభుత్వం ఊరుపేరు లేని కంపెనీల నాసిరకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయించడంతో పలువురు మందుబాబులు నాటుసారా వైపు మళ్లారు. ఎక్సైజ్ శాఖను నిర్వీర్యం చేయడంతో ఆ శాఖ అధికారులు సైతం నాటుసారా కట్టడికి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రైవేటు వ్యాపారులకు అప్పగించింది. వైసీపీ హయాంతో పోలిస్తే మద్యం రేట్లు తక్కువ వుండడమే కాకుండా, ప్రముఖ కంపెనీల మద్యం అందుబాటులోకి రావడంతో మందుబాబులు నాటుసారా సేవించడం తగ్గుతుంది. అయినప్పటికీ మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో నాటుసారా ప్రభావం వుంటుంది. దీనిని అరికట్టాలన్న ఉద్దేశంతోనే మద్యం బెల్టు అమ్మకాలు చేపట్టాల్సి వస్తున్నదని మద్యం వ్యాపారి ఒకరు సమర్థించుకుంటున్నారు మండలంలో తొమ్మిది మద్యం షాపులు లాటరీలో వివిధ పార్టీలు, వర్గాల వారికి వచ్చినప్పటికీ, అందరూ సిండికేట్‌గా ఏర్పడి గ్రామాల్లో బెల్టు అమ్మకాలు జరపాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇందుకోసం గ్రామ పెద్దలను కలిసి వేలం పాటలు నిర్వహిస్తున్నారు. తొలుత మార్టూరులో శుక్రవారం వేలం పాట నిర్వహించగా.. ఏడాదిపాటు మద్యం అమ్ముకోవడానికి ఓ వ్యక్తి రూ.5.25 లక్షలకు పాట పాడారు.

ఫిష్ ఆంధ్రాలో గోల్‌మాల్

... 5వ పేజీ తరువాయి

పరిసరాల్లో కొంతమందికి ఫిష్ ఆంధ్రా యూనిట్‌లు మంజూరుకాగా ఒక్క యూనిట్ కూడా ఏర్పాటు కాకుండానే రుణాలు మంజూరు చేసినట్టు ఆరోపణలున్నాయి. మత్స్య శాఖలో గత వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని కొందరు మత్స్యకార యువకులు, కూటమి నేతలకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కాగా ఫిష్ ఆంధ్రా యూనిట్ల నిధులు దుర్వినియోగంపై మత్స్య శాఖ ఏడీ ప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. నిధులు దుర్వినియోగం అవడానికి అవకాశం లేదన్నారు. కొన్నిచోట్ల యూనిట్లు తెరవడలేదన్నది వాస్తవమేనన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో మరో 200 పడకలు

... 5వ పేజీ తరువాయి


క్రిటికల్ కేర్ యూనిట్ భవనం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

కొణతాల చెప్పారు. రూ.22 కోట్లతో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ) బ్లాక్ ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తుందని, ఇక్కడ రోగులకు అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. వైద్య సేవలను మరింత పెంచేందుకు అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.5 కోట్లతో నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి ఇస్తామన్నారు. గత ప్రభుత్వం మందుల సరఫరాకు అవసరమైన నిధులు కూడా సక్రమంగా కేటాయించలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మందులకు బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, జనసేన నాయకులు ఆళ్ల రామచంద్రరావు, పీలా నాగశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా సమాఖ్య ఎన్నికల్లో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

వెలుగు కార్యాలయంలో చేపట్టారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒకరు చొప్పున 24 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు హాజరయ్యారు. అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారిని ఎన్నుకోవలసి ఉంది. నిబంధనల ప్రకారం ఎస్టీ మహిళను జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నర్సీపట్నం నుంచి వచ్చిన సాయిప్రశాంతి అనే సభ్యురాలు పోటీ చేశారు. అయితే ఆమె స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తుండడంతో పోటీ చేయడానికి వీల్లేదంటూ పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల వారు వాగ్వాదానికి దిగారు. సాయిప్రశాంతి తనతోపాటు ఎనిమిది మంది సభ్యులను సమావేశం నుంచి బయటకు తీసుకొని వెళ్లిపోయారు. దీంతో ఎన్నికను వాయిదా వేస్తున్న ఏపీడీ డైసీ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నర్సీపట్నానికి చెందిన సాయి ప్రశాంతి కార్యదర్శిగా పోటీ చేసేందుకు అనర్హురాలని చెప్పారు. ఆమె ఒక ఎన్‌జీవోను నడుపుతున్నట్టు జిల్లా సమాఖ్యకు సమాచారం వచ్చిందన్నారు. మ్యాక్స్ చట్టంలోని బైలా ప్రకారం ఎన్‌జీవోను నడుపుతున్నవారు జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గ ఎన్నికల్లో పాల్గొనరాదన్నారు.

విన్నపాల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

చదివిన తనకు ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని విశాఖకు చెందిన బత్తుల దుర్గాప్రణీత్ విజ్ఞప్తి చేశారు. బీసీఏ కంప్యూటర్స్ ఎంబీఏ చదివిన తన కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించాలంటూ విశాఖకు చెందిన అనసూరి మధుసూదనరావు మంత్రిని కోరారు. షెడ్యూల్ కులానికి చెందిన తనకు రేషన్ దుకాణం మంజూరుచేయాలని కంచరపాలెం ప్రాంతానికి చెందిన మోర్ల రాజారావు వేడుకున్నారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించిన మంత్రి లోకేశ్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను మంత్రి కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు.